తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
TELTEL/2023/88710
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | మంగళవారం-17- జూన్ - 2025 | సంపుటి : 3 | సంచిక : 21 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

# తొమ్మిది రోజుల్లో 70 లక్షల మందికి రూ.9 వేల కోట్లు

- గత ప్రభుత్వంపై సీఎం రేవంత్ మండిపాటు
- రైతు భరోసా పథకాన్ని ప్రారంభించిన సీఎం
- గత ప్రభుత్వ రుణమాఫీపై ఘాటైన విమర్శలు
- పేదల కోసం సన్న బియ్యం పంపిణీ–బోనస్‌తో ప్రోత్సాహం
- బిల్లుల బకాయిల భారం రూ.1.29 లక్షల కోట్లు
- రూ.8.29 లక్షల అప్పుతో రాష్ట్రాన్ని నాశనం చేశారు
- ప్రజలకు నాలుగు కోట్లకు స్వేచ్ఛ కల్పించాం
- రైతులకు సబ్సిడీతో పాటు ఏఐ అవగాహన
- జిమ్‌కు వెళ్లొద్దు... జొన్నరొట్టెలు తినండి
- ఏ పంట పండించినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది
- ప్రతిపక్షాల తిట్లన్నీ మాకు ఆశీర్వాదం



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

రాష్ట్రం మరో వందేళ్లయినా కోలుకోనివిధంగా గత భారాస ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్లలో విధ్వంసం చేసిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. విద్యార్థులు, రైతులు ఆత్మహత్య చేసుకుంటే ప్రతిపక్షాలు సంతోషంతో నృత్యాలు చేస్తున్నాయని, వారి చావులపై అధికారంలోకి రావచ్చన్న దురాశతో పనిచేస్తున్నాయని ధ్వజమెత్తారు. ప్రభుత్వానికి ఎన్ని కష్టాలు ఉన్నా.. రైతు బాగుంటే రాష్ట్రం బాగుంటుందన్న ఉద్దేశంతో రైతుభరోసా పథకం అమలు చేస్తున్నామని తెలిపారు. తొమ్మిది రోజుల్లో 1.49 కోట్ల ఎకరాలకు... 70.11 లక్షల మంది రైతులకు రూ.9 వేల కోట్ల నగదు బదిలీ చేస్తామని చెప్పారు. తెలంగాణను దేశంలో నం.1 రాష్ట్రంగా తీర్చిదిద్దే బాధ్యత తీసుకుంటామని అన్నారు. రైతుల పెట్టుబడికి రెండింతల లాభం వచ్చినపుడే రానున్న పదేళ్లలో రాష్ట్రం ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమవుతుందని చెప్పారు. సోమవారం హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతు నేస్తం కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొని... రైతుభరోసా నిధుల విడుదలను బటన్ నొక్కి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

మిగతా 2లో..



# ఫార్ములా-ఈ కేసుపై కేటీఆర్‌కు ఏసీబీ ప్రశ్నల వర్షం

- జూన్ 18లోగా పాత ఫోన్ల సమర్పణకు ఆదేశం
- వరుస ప్రశ్నలు.. మధ్య మధ్యలో బ్రేక్
- డాక్యుమెంట్లు ముందుంచి ప్రశ్నలు
- రూ.45.71 కోట్ల బదిలీపై స్పష్టత కోరిన ఏసీబీ
- ఎలక్టోరల్ బాండ్స్ పై కూడా విచారణ
- బీఆర్ఎస్ శ్రేణుల హడావుడి.. స్వల్ప ఉద్రిక్తత

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఫార్ములా-ఈ కారు రేసు కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావును ఏసీబీ అధికారులు సోమవారం 8 గంటలకు పైగా విచారించారు. రేసు నిర్వాహకులతో కుదుర్చుకున్న ఒప్పందాలు మొదలు, నిధుల మళ్లింపు, నిబంధనల అతిక్రమణ, విదేశీ కంపెనీతో జరిపిన లావాదేవీలు..తదితర అంశాలపై ప్రశ్నల వర్షం కురిపించారు.

మిగతా 2లో..

# బనకచర్లపై సీఎం రేవంత్ చొరవ చూపాలి

- రాజాసింగ్‌పై సెటైర్ వేసిన కిషన్‌రెడ్డి
- బనకచర్లపై రేవంత్ చొరవ చూపాలి
- కాళేశ్వరం దోపిడీపై సీబీఐ విచారణ డిమాండ్
- బీసీలకు 42% రిజర్వేషన్ డిమాండ్
- ఫోన్ ట్యాపింగ్ కేసు సీబీఐకి అప్పగించాలి
- గాంధీ ఆస్పత్రి సందర్శన



హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తాను సాధారణ కార్యకర్తనని, ఎమ్మెల్యే రాజాసింగ్ సీనియర్ నాయకుడని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సెటైర్ వేశారు. ఇటీవల రాజాసింగ్ బీజేపీలోని కొంతమంది సీనియర్ నాయకులపై తీవ్ర విమర్శలు చేసిన సంగతి తెలిసిందే. పార్టీ నాయకత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో విలేకరులు అడిగిన ప్రశ్నకు కిషన్‌రెడ్డి స్పందించారు. రాజాసింగ్‌పై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. "రాజకీయ అనుభవం ఉన్న సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధి మాట్లాడినప్పుడు తప్పకుండా వింటాం. వారి మాటలను గౌరవించి చర్చిస్తాం. వారంతా పార్టీ కోసం త్యాగాలు చేసిన వాళ్లు. మేమంతా సాధారణ కార్యకర్తలం'' అని అన్నారు.

బనకచర్లపై రేవంత్ చొరవ చూపాలి

బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి తెలంగాణ ప్రజల హక్కులు కాపాడేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకోవాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టు వల్ల తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై కేంద్ర జలవనరుల శాఖ మంత్రికి సీఎం లేఖ రాయాలని కోరారు.

మిగతా 2లో..

# అసంపూర్తిగా ఉన్న 69 వేల ఇళ్లను బీఎల్‌సీ పద్ధతిలో పూర్తి

- బీఎల్‌సీ పద్ధతిలో ఇళ్ల నిర్మాణం
- రూ.5 లక్షల ఆర్థిక సాయం
- అసంపూర్తిగా ఉన్న ఇళ్లకు మౌలిక వసతులు
- లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ వేగవంతం
- 2.65 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు
- 4.50 లక్షల ఇళ్ల లక్ష్యం, భారీ ఖర్చు
- 71 వేల ఇళ్ల పనులు ప్రారంభం

2లో..



# సర్కార్ చేతగానితనానికి నిదర్శనం: హరీశ్‌రావు

- మెడికల్ కళాశాలల పరిస్థితిపై హరీశ్‌రావు ఆవేదన
- కాంగ్రెస్ పాలన వైద్య విద్యార్థులకు శాపంగా మారిందని విమర్శ
- నిధులు విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును నిలబెట్టాలని డిమాండ్

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)




బీఆర్ఎస్ హయాంలో ఎంతో ముందుచూపుతో ప్రారంభించిన ప్రభుత్వ వైద్య కళాశాలల భవితవ్యం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రశ్నార్థకంగా మారిందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు సోమవారం 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. రాష్ట్రంలోని 26 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సౌకర్యాలు, వసతులు నిబంధనల ప్రకారం లేవని పేర్కొంటూ.. ఈనెల 18న హెల్త్ సెక్రటరీ, డీఎంఈ ఇద్దరూ జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) ముందు ప్రత్యక్షంగా హాజరుకావాలని ఆదేశాలివ్వడం కాంగ్రెస్ ప్రభుత్వ చేతగాని తనానికి నిదర్శనమన్నారు.

కాంగ్రెస్ పరిపాలనా వైఫల్యం వైద్య విద్యార్థులకు శాపంగా మారుతోందని విమర్శించారు. సీఎం రేవంత్ ఇప్పుడు మేల్కొని దానిపై కమిటీ వేయడం హాస్యాస్పదమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పరిపాలనను గాలికొదిలేసి ప్రతీకార రాజకీయాలు చేస్తున్నారని పేర్కొన్నారు. వందలాది వైద్య విద్యార్థుల భవిష్యత్తుకు ఎవరు భరోసానిస్తారో చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తక్షణమే మెడికల్ కళాశాలలకు నిధులు విడుదల చేసి, వైద్య విద్యార్థుల జీవితాలను నిలబెట్టాలని కోరారు.



# దేశవ్యాప్తంగా 16వ జనగణన, కులగణనకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

- జనగణన ప్రారంభ తేదీలు ప్రకటించిన కేంద్రం
- 34 లక్షల మంది ఎన్యూమరేటర్లు రంగంలోకి
- రెండు విడతలుగా జనగణన ప్రక్రియ
- రూ.13,000 కోట్ల అంచనా వ్యయం
- కులగణనపై తొలి నిర్ణయం – స్వాతంత్ర్యం తర్వాత ప్రథమం
- పూర్వపు ప్రయత్నాలు, ప్రస్తుత నిర్ణయం తారతమ్యం



న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు)

దేశవ్యాప్తంగా 16వ జనగణనతోపాటు కులగణన నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం సోమవారం నోటిఫికేషన్ జారీచేసింది. చివరిగా 2011లో దేశంలో జనగణన జరగగా మళ్లీ 16 సంవత్సరాల తర్వాత ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించనున్నది.

మిగతా 7లో..

# సైప్రస్ అధ్యక్షుడికి ప్రధాని మోదీ ఇచ్చిన భారతీయ సంప్రదాయ బహుమతులు

- సైప్రస్ అధ్యక్షుడికి మోదీ బహుమతులు
- కాశ్మీరీ సిల్క్ కార్పెట్ ప్రత్యేకతలు
- ఆంధ్ర కళాకారుల చేతి పనిగా వెండి క్లచ్ పర్స్



న్యూఢిల్లీ, (తెలంగాణ ముచ్చట్లు)

సైప్రస్ అధ్యక్షుడు నికోస్ క్రిస్టోడౌలిడెస్‌కు ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం పలు బహుమతులు అందజేశారు. చేతితో తయారు చేసిన కాశ్మీరీ సిల్క్ కార్పెట్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ కళాకారులు రూపొందించిన వెండి పర్సును బహూకరించారు.

మిగతా 7లో..

# ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలపై ట్రంప్ కఠిన వ్యాఖ్యలు

- ఇరాన్ చర్చలకు సానుకూల సంకేతాలు
- ట్రంప్ హెచ్చరిక: యుద్ధం గెలవలేరు
- గల్ఫ్ దేశాల ఆందోళన



7లో..

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కేటీఆర్ కు మద్దతుగా డిటిఆర్

◆ ఎసిబి విచారణకు ముందు కేటీఆర్‌ను కలిసిన తాటికొండ రాజయ్య

హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:

తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాల మధ్య బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే. తారకరామారావు (కేటీఆర్) ఈ రోజు ఉదయం ఎసిబి విచారణకు హాజరయ్యారు. విచారణకు వెళ్లేముందు కేటీఆర్‌ను తెలంగాణ భవన్‌లో రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే (డిటిఆర్)డాక్టర్ తాటికొండ రాజయ్య కలిసి సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా రాజయ్య మాట్లాడుతూ, "కేటీఆర్‌పై నమోదైన ఆరోపణలు రాజకీయ ప్రయోజనాల కోణంలో చేస్తున్నవే తప్ప వాస్తవానికి దూరంగా ఉన్నాయ్. ప్రజల మనస్సుల్లో నమ్మకంతో నిలిచిన నాయకుడిని వేధించే కుట్రలు ఎంతకాలం నిలవవు. ఆయనకు పూర్తి మద్దతుగా ఉన్నాం" అన్నారు. పార్టీకి జరిగిన అన్యాయాన్ని ఖండిస్తూ ఆయన పార్టీ శ్రేణులంతా కేటీఆర్ వెన్నుదన్నుగా నిలవాలని పిలుపునిచ్చారు.



తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి శ్రామికులుగా పనిచేసిన కుటుంబం నుండి వచ్చిన కేటీఆర్‌పై ఆరోపణలు చేయడం బాధాకరమని, ప్రజాస్వామ్యంలో ఇటువంటి చర్యలు విభజనలకు దారితీసే ప్రమాదం ఉందని రాజయ్య వ్యాఖ్యానించారు.

కేటీఆర్ విచారణకు ముందే పలువురు నాయకులు, మద్దతుదారులు ఆయనను కలిసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే డాక్టర్ తాటికొండ రాజయ్య కూడా ఆయనను వ్యక్తిగతంగా కలిసి, బలంగా ఉండాలని, ధైర్యంగా ఎదుర్కొనాలని సూచించారు.



# ఫార్ములా-ఈ కేసుపై కేటీఆర్‌కు ఏసీబీ ప్రశ్నల వర్షం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా కేటీఆర్ సెల్‌ఫోన్‌ను సీజ్ చేసేందుకు ప్రయత్నించారు. ఫోన్ ఇవ్వమని కోరగా..తీసుకురాలేదని కేటీఆర్ సమాధానమిచ్చినట్టు తెలిసింది. దీంతో ఫార్ములా ఈ-కారు రేసు నిర్వహణకు సంబంధించి ఒప్పందాలు మొదలైన 2021 నుంచి 2024 మధ్య కాలంలో వినియోగించిన సెల్‌ఫోన్లు ఈ నెల 18 లోగా అప్పగించాలని కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు ఆదేశించారు.

**వరుస ప్రశ్నలు..మధ్యమధ్యలో బ్రేక్**

ఏసీబీ అధికారుల నోటీసుల మేరకు కేటీఆర్ సోమవారం ఉదయం 10 గంటలకు తన న్యాయవాది రాంచందర్‌రావుతో కలిసి బంజారాహిల్స్‌లోని ఏసీబీ ప్రధాన కార్యాలయానికి చేరుకున్నారు. కేవలం కేటీఆర్ వాహనాన్ని మాత్రమే పోలీసులు లోనికి అనుమతించారు. కాగా సాయంత్రం 6 గంటల వరకు అధికారులు కేటీఆర్‌ను ప్రశ్నించారు.

ఏసీబీ డైరెక్టర్ తరుణ్‌జోష్, జాయింట్ డైరెక్టర్ రితిరాజ్, ఏసీబీ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ (సీఐయూ) డీఎస్పీ మాజిద్ అలీ ఖాన్‌లతో కూడిన బృందం ప్రశ్నించినట్టు తెలిసింది. మధ్యలో టీ బ్రేక్‌లు ఇచ్చారని, మధ్యాహ్నం 45 నిమిషాలకు పైగా భోజన విరామం ఇచ్చినట్టు తెలిసింది. కేసు దర్యాప్తులో భాగంగా ఈ ఏడాది జనవరి 9న కేటీఆర్‌ను ఏసీబీ అధికారులు ప్రశ్నించిన విషయం తెలిసిందే. దానికి కొనసాగింపుగా సోమవారం నాటి విచారణలో పలు కీలక అంశాలపై ప్రశ్నించారు.

**డాక్యుమెంట్లు ముందుంచి..**

ఈ కేసులో ఏ-2 అయిన సీనియర్ ఐఏఎస్ అధికారిఅర్వింద్‌కుమార్, ఏ-3 హెచ్ఎండీఏ బోర్డు మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్‌రెడ్డితో పాటు గ్రీన్‌కో ఏస్ నెక్స్ జెన్ ఎండీ చలమలశెట్టి అనిల్‌కుమార్ స్టేట్మెంట్లలో గుర్తించిన అంశాలు, ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థ ప్రతినిధులను, సీఈవోను జూమ్ మీటింగ్ ద్వారా గతంలో వర్చువల్‌గా విచారించిన సమయంలో వారిచ్చిన స్టేట్మెంట్ల ఆధారంగా తయారు చేసుకున్న ప్రశ్నావళి ఆధారంగా కేటీఆర్‌ను అధికారులు ప్రశ్నించినట్టు తెలిసింది. ఇప్పటికే సేకరించిన పలు డాక్యుమెంట్లను ముందుంచి ప్రశ్నించారు. వరుస ప్రశ్నలు వేస్తూ, డాక్యుమెంట్లను చూపుతూ వివరాలు రాబట్టారు. కేటీఆర్ చెప్పేదంతా వీడియో రికార్డింగ్ చేశారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉండగా ఏ హోదాలో ఆదేశాలు ఇచ్చారనే కోణంలో విచారణ సాగింది. మొదటి దఫా విచారణలో కేటీఆర్ ఇచ్చిన సమాచారం, కేసు దర్యాప్తులో సేకరించిన డాక్యుమెంటరీ ఎవిడెన్స్ ఆధారంగా క్రాస్ క్వశ్చనింగ్ చేశారు.

ఫార్ములా ఈ ఆపరేషన్స్ సంస్థ ఖాతాలకు రూ.45.71 కోట్లు బదిలీ చేయడంపై, అనధికారింగా ఈ నగదు బదిలీ ఎందుకు చేయాల్సి వచ్చిందన్న విషయాలపై మరోసారి ప్రశ్నించినట్టు తెలిసింది. బీఆర్ఎస్ పార్టీ ఎలక్టోరల్ బాండ్స్ గ్రీన్‌కో కంపెనీ కొనుగోలుపైనా ఆరా తీసినట్టు తెలిసింది. కాగా అవసరమైతే మరోసారి విచారణకు రావాల్సి ఉంటుందని కేటీఆర్‌కు ఏసీబీ అధికారులు సూచించినట్టు తెలిసింది.

**బీఆర్ఎస్ శ్రేణుల హడావుడి..ఉద్రిక్తత**


కేటీఆర్ విచారణకు బంజారాహిల్స్ వస్తుండడంతో పాటు అక్కడి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో అదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల సమావేశం జరగనున్న నేపథ్యంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఏసీబీ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలో ముందుగానే బారికేడ్లు ఏర్పాటు చేశారు. అయితే తెలంగాణ భవన్ నుంచి కేటీఆర్‌ను అనుసరిస్తూ పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, పార్టీ శ్రేణులు ఏసీబీ కార్యాలయం వద్దకు వచ్చారు. అయితే పోలీసులు వారిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు ముందే అడ్డుకున్నారు.

కొందరు బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు పక్కనే ఉన్న నీలోఫర్ కేఫ్‌లోకి వెళ్లడంతో వారిని అక్కడి నుంచి పంపించేందుకు ప్రయత్నించారు. దీంతో వారు పోలీసులతో వాగ్వాదానికి దిగడంతో కొద్దిసేపు స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. ఈ క్రమంలో నీలోఫర్ కేఫ్‌తో పాటు పరిసర ప్రాంతాల్లోని వ్యాపార సముదాయాలను పోలీసులు కాసేపు మూసివేయించారు.

# తొమ్మిది రోజుల్లో 70 లక్షల మందికి రూ.9 వేల కోట్లు

(మొదటి పేజీ తరువాయి)




రైతుల ఆశీర్వాదం ఉంటేనే అధికారం

"రుణమాఫీ, రైతుభరోసా, ఉచిత విద్యుత్తు, ధాన్యం కొనుగోళ్లు, రైతుబీమా, సన్న ధాన్యానికి బోనస్ కింద గడిచిన 18 నెలల్లో రైతుల కోసం ప్రభుత్వం రూ.1.01 లక్షల కోట్లు ఖర్చు పెట్టింది. భారాస హయాంలో రుణమాఫీ ఎంత జరిగింది? ఏడాదిలో మేం ఎంత మాఫీ చేశామో గ్రామాల్లో చర్చలు పెడతాం. గత ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లకు ఐకేపీ కేంద్రాలు తెరవలేదు. మేం 8 వేల కేంద్రాలు తెరిచి, 48 గంటల్లో నగదు బదిలీ చేయడంతోపాటు బోనస్ ఇచ్చాం. గత ప్రభుత్వం ధరణి పేరిట దోపిడీ చేస్తే.. భూభారతితో పొంగులేటి అండగా ఉన్నారు. గతంలో ప్రభుత్వాన్ని నడిపినవాళ్లే ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు ఏర్పాటై 18 నెలలు తిరగకముందే నిందిస్తూ... వీధి నాటకాలతో బయలుదేరారు. వారు 2014లో రూ.లక్ష రుణమాఫీని నాలుగు విడతల్లో చేస్తే అసలుకు వడ్డీలు పెరిగాయి తప్ప రైతులకు ఏమీ మిగల్లేదు. 2018లో ఒకేసారి చేస్తామని చెప్పి ఐదేళ్ల తర్వాత రూ.11,500 కోట్లు రుణమాఫీ చేశారు. వాటిలో రూ.8,500 కోట్లు వడ్డీకి సరిపోయాయి. గత ప్రభుత్వం రెండు విడతల్లో చేసిన రుణమాఫీ రూ.1617 వేల కోట్లకు మించలేదు. మా ప్రభుత్వానికి తొలి ఏడాదిలో ఎన్నో ఇబ్బందులున్నా ఒకేసారి రుణమాఫీ చేశాం.

**పేదల కడుపు నింపుతున్న సన్న బియ్యం**

రేషన్ షాపుల్లో దొడ్డు బియ్యం ఇస్తే మిల్లర్లు కొంటున్నారు. పేదలకు సన్న బియ్యం పంపిణీ చేసేందుకు సన్న వడ్లు పండించాలని, క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని రైతులకు విజ్ఞప్తి చేశాం. దీంతో గత వానాకాలం సీజన్‌లో 60 శాతం సన్న వడ్లు పండించారు. రేషన్ షాపుల ద్వారా ప్రభుత్వం ఇస్తున్న సన్న బియ్యం పేదల కడుపు నింపుతోంది. రైతుల పంటలు కొనుగోలు చేస్తే రూ.7 వేల కోట్ల నష్టం వచ్చిందని, ప్రభుత్వం సత్రం నడపడం లేదని అప్పటి సీఎం అన్నారు. వరి వేస్తే ఉరివేసుకున్నట్లేనన్నారు. స్వయంగా తన 150 ఎకరాల్లో వడ్లు పండించి క్వింటాలుకు రూ.4,200 చొప్పున విక్రయించారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు వరి పండిస్తే ప్రభుత్వమే కొంటుందని మేం చెప్పాం. దీంతో 2.2 లక్షల టన్నుల వడ్లు పండించి దేశంలోనే తొలి స్థానంలో నిలిచారు. సన్న వడ్లు పండించడంలోనూ అగ్రస్థానం మనదే. ఇంతకన్నా రైతుల కళ్లలో ఆనందం ఏముంటుంది?

**రూ.8.29 లక్షల అప్పులు మోపారు..**


బిల్లులు రాలేదని మాజీ సర్పంచులు అంటున్నారు. మా ప్రభుత్వం వచ్చేనాటికి వారి పదవీకాలం ముగిసిపోయింది. గత ప్రభుత్వం రూ.1.29 లక్షల కోట్ల బిల్లులను చెల్లించలేదు. ఇందులో రూ.60 వేల కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సినవి కాగా... రూ.20 వేల కోట్లు ఉచిత విద్యుత్తు బిల్లులవి. గత ప్రభుత్వం రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయలేదు. ప్రభుత్వ ఉద్యోగులకే రూ.12 వేల కోట్ల బకాయి పెట్టింది. రూ.8.29 లక్షల కోట్ల అప్పు మిగిల్చి ఆర్థిక విధ్వంసానికి పాల్పడింది. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దేందుకు రోజుకు 18 గంటలు పనిచేసినా సరిపోని పరిస్థితి. ఫీజు రీయింబర్స్‌మెంట్, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి అమలు కష్టంగా ఉంది. పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వలేని పరిస్థితి.

**4 కోట్ల మందికి స్వేచ్ఛ వచ్చింది...**

ట్యాపింగ్ కారణంగా గతంలో భార్యాభర్తలు ఫోన్‌లో మాట్లాడుకోవాలన్నా భయపడే పరిస్థితులుండేవి. మా ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు కోట్ల మంది ప్రజలకు స్వేచ్ఛ వచ్చింది. కులగణన, ఎస్సీ వర్గీకరణ చేశాం. మా ప్రభుత్వంలో ఐదుగురు ఎస్సీలు మంత్రులు, స్పీకర్‌గా ఉన్నారు. గతంలో ఉన్నది ఒక్కరే. ఏడాదిలో 60 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. సివిల్స్ చదివే రైతుల పిల్లలకు రూ.2 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నాం.

**రైతులకు ఏఐపై అవగాహన కల్పించాలి**

రాష్ట్రంలో పరిశ్రమలకు రాయితీలు, భూములు ఇచ్చినట్టు... రైతులకు సబ్సిడీ ఇవ్వడంతోపాటు ఏఐపై అవగాహన కల్పించాలి. రైతులకు వ్యవసాయ పరికరాలు అందించి, వాణిజ్య పంటల సాగును ప్రోత్సహిస్తాం. కుటుంబంలో నలుగురు ఉంటే.. ఒకరు వ్యవసాయం, ఒకరు ఇంటి పనులు, ఒకరు ఉద్యోగం, మరొకరు వ్యాపారం చేస్తే ఆర్థికంగా నిలబడుతుంది. రైతులకు ఏటా రూ.17 వేల కోట్ల విలువైన ఉచిత విద్యుత్తు అందిస్తున్నాం. వారందరూ సౌర విద్యుత్‌కు మారితే అదనంగా నెలకు రూ.23 వేల ఆదాయం వచ్చేలా చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. రైతులు ఇంటివద్ద కూర్చున్నా ఆదాయం వచ్చేలా ప్రణాళిక రూపొందించాలని, సోలార్ పంపుసెట్లతో ప్రయోజనంపై వారికి అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశిస్తున్నా. ఏ భూమిలో ఏయే రకాల పంటలు, పండ్లు, కూరగాయలు వేయాలన్న విషయమై రైతులకు అవగాహన కల్పించాలి. అనుభవమున్నవారితో సదస్సులు నిర్వహించాలి. వారికి రోజుకు రూ.వెయ్యి గౌరవ భత్యం ఇవ్వాలి. కొడంగల్, తాండూరులలో కందిపప్పు, అచ్చంపేటలో దోసకాయలు పండుతాయి. దోసకాయ, కందిపప్పుతో వండిన కూరతో జొన్న రొట్టె తింటే చాలా బాగుండేది. ఇప్పుడు ఆ రుచులు పోయాయి.



ఇప్పుడు తింటున్న మిల్లెట్స్ మన తాతముత్తాతలు తిన్నవి కాదా? జిమ్‌లకు వెళ్లి, స్టెరాయిడ్లు తీసుకుని ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దు. జొన్నరొట్టెలు తిని.. ఎవరి దుస్తులు వారు ఉతుక్కుంటే సిక్స్‌ప్యాక్ వస్తుంది.

**ఊర్లో ఇల్లు, పొలం రైతుకు గౌరవం..**

ఊర్లో ఇల్లు, వ్యవసాయ భూమి ఉంటే రైతులకు ఆత్మగౌరవం. రాష్ట్రంలో రైతులందరికీ ప్రభుత్వం అండగా ఉంటుంది. వారు పంట మార్పిడి చేయాలి. ఏ పంట పండించినా కొంటాం. ప్రభుత్వంలో మంత్రులతో మంచి జట్టు ఉంది. అనుభవమున్న వారు ఉన్నారు. అందరి సహకారంతో మంచి పరిపాలన అందిస్తాం. ప్రతిపక్షాలు ఎంత గోల పెట్టినా, ధర్నాలు చేసినా పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుంది. గతంలో పదేళ్లు అధికారంలో ఉన్నవారు రైతుభరోసా, గిట్టుబాటు ధర, సర్పంచుల బిల్లులు ఎందుకు చెల్లించలేదు? ప్రతిపక్షాల తిట్లన్నీ మాకు ఆశీర్వాదం అవుతాయి. నేను ప్రజాసంక్షేమం కోసమే పనిచేస్తా. ఇక రైతులు, యువత ప్రతిపక్షాల పనిపట్టాలి" అని ముఖ్యమంత్రి అన్నారు.

# బనకచర్లపై సీఎం రేవంత్ చొరవ చూపాలి

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర జలశక్తి మంత్రితో కలిసి ఏపీ సీఎం చంద్రబాబుతో చర్చలు జరపాలని విజ్ఞప్తి చేశారు. వివాద పరిష్కారం కోసం రెండు రాష్ట్రాల మధ్య చర్చలు జరగాలని, ఇదే తమ వైఖరి అని తెలిపారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. "బనకచర్ల ప్రాజెక్టుకు సంబంధించి కేంద్రం ఇప్పటి వరకు ఏమీ చేయలేదు. ప్రాథమిక సాధ్యాసాధ్యాల నివేదిక (పీఎఫ్‌ఆర్)పై అధ్యయనం చేయాల్సి ఉంది. డీపీఆర్ ఇంకా కేంద్రం వద్దకు రాలేదు. గోదావరి బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే కేంద్ర జలసంఘం సమగ్ర పరిశీలన జరపాలన్న నిబంధన ఉంది. సీడబ్ల్యూసీ నివేదిక ఇచ్చిన తర్వాత కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది. మన తరపున రాష్ట్ర ప్రభుత్వం వాదనలు వినిపించాలి. సీఎం రేవంత్ కేంద్ర జలశక్తి మంత్రికి లేఖ రాయాలని గతంలోనే కోరాను. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన దోపిడీపై సీబీఐ విచారణ జరపాలని మేం మొదటి నుంచీ కోరుతున్నాం. ప్రతిదానికీ బీజేపీని విమర్శించడం కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు అలవాటైపోయింది. కాంగ్రెస్ హైకమాండ్, కేసీఆర్ కుటుంబం చేసుకున్న ఒప్పందంలో భాగంగానే ఇరుపార్టీలు ఉత్తుత్తి ఫైటింగ్ చేస్తున్నాయి" అని పేర్కొన్నారు. డిజిటల్ విధానంలో జనగణన ఉంటుందని, దాని కోసం యాప్ రూపొందిస్తున్నామని కిషన్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీకి అనుగుణంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌తో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐకి అప్పగించాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ అంశంపై తాము హైకోర్టును ఆశ్రయించామని, తమకు అనుకూలంగా తీర్పు వస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

గాంధీ ఆస్పత్రి సందర్శన

గాంధీ ఆస్పత్రిని మరింత అభివృద్ధి చేసి, సౌకర్యాలను మెరుగుపరచాల్సిన అవసరం ఉందని కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆస్పత్రిని సందర్శించిన ఆయన వివిధ విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రి ప్రాంగణంలోని భవనాల నిర్వహణను పరిశీలించారు. మురుగునీటి వ్యవస్థ మెరుగుపరచాలని సూచించారు. ఔట్‌సోర్సింగ్ సంస్థతో మాట్లాడి ఆర్ఎంవోలు, సెక్యూరిటీ గార్డులు, పారిశుధ్య కార్మికులకు టైమ్‌కు జీతాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఆస్పత్రిలోని మదర్ చైల్డ్ ఆస్పత్రి(ఎంసీహెచ్) భవనం, ఓపీ భవనంలో నీళ్లకు ఇబ్బంది అవుతోందని, సీటీ స్కాన్, ఎంఆర్ఐ యంత్రాలు పనిచేయకపోవడంతో అవస్థ పడుతున్నామని రోగులు కిషన్‌రెడ్డికి తెలిపారు. వైద్యులు అందుబాటులో ఉండటం లేదని కొంత మంది చెప్పారు. కొవిడ్ కేసులు మళ్లీ పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వ ఆస్పత్రులను సందర్శించాలని ప్రధాని మోదీ ఆదేశించారని కిషన్‌రెడ్డి తెలిపారు.



# అసంపూర్తిగా ఉన్న 69 వేల ఇళ్లను బీఎల్‌సీ పద్ధతిలో పూర్తి

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

అసంపూర్తిగా ఉన్న 69 వేల రెండు పడక గదుల ఇళ్లను లబ్ధిదారు నేతృత్వంలో నిర్మాణం (బీఎల్‌సీ) పద్ధతిలో పూర్తిచేస్తామని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇందుకోసం ఆయా లబ్ధిదారులకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తామని వెల్లడించారు. ఇందిరమ్మ ఇళ్లు, రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతులపై సంబంధిత అధికారులతో సచివాలయంలో సోమవారం మంత్రి సమీక్ష నిర్వహించారు. "గత ప్రభుత్వం పదేళ్లలో 60 వేల ఇళ్లను మాత్రమే అరకొరగా పూర్తిచేసింది. తాగునీరు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ వంటి కనీస వసతులు కల్పించలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు పడక గదుల ఇళ్ల వద్ద మౌలిక వసతులు కల్పించాం. అసంపూర్తిగా ఉన్న 1.61 లక్షల ఇళ్లకు రూ.640 కోట్లు ఖర్చు చేశాం. 98 వేల మంది లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించాం. మిగిలిన ఇళ్లను లబ్ధిదారులకు కేటాయిస్తాం. మరో 69 వేల ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. వీటిని బీఎల్‌సీ (బెనిఫిషియరీ లెడ్ కన్‌స్ట్రక్షన్) పద్ధతిలో పూర్తి చేస్తాం. ఈ ఇళ్లకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియను అధికారులు వేగవంతం చేయాలి" అని పొంగులేటి సూచించారు.

**2.65 లక్షల ఇందిరమ్మ ఇళ్ల మంజూరు..**

'ఈ ఏడాది 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇందుకోసం రూ.22,500 కోట్లు ఖర్చు చేయనున్నాం. ఇప్పటివరకు 2.65 లక్షల మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించాం. ఇందులో 71 వేల ఇళ్ల పనులు ప్రారంభమయ్యాయి. సుమారు 3 వేల ఇళ్లు గోడలు, స్లాబ్ వరకు పూర్తయ్యాయి" అని మంత్రి పేర్కొన్నారు.

# మీ ఇంటి పెద్దకొడుకుగా చెప్తున్నా..!

- అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తా... నాదీ హామీ
- ఇచ్చిన హామీల్లో కొన్ని అమలు చేశాం.... మిగిలినవి కూడా చేస్తాం
- తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**





అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించే బాధ్యత... మీ ఇంటి పెద్దకొడుకుగా నాదీ హామీ అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. నేలకొండపల్లి మండల పర్యటనలో భాగంగా గువ్వలగూడెంలో అంతర్గత సీసీ రోడ్లకు, కోరట్లగూడెం, ముటాపురం గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదే విధంగా వివిధ పార్టీలకు చెందిన పలువురికి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. పలుచోట్ల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలో ఇచ్చిన హామీలు అనేకం అమలు చేసిందని.... రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేకపోయినా మిగిలిన హామీలను కూడా అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. మొదటి విడతలో ఇందిరమ్మ ఇండ్లు రాలేదని ఎవరూ బాధపడొద్దని .... విడతల వారీగా అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు ఇప్పించే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. దాదాపుగా ప్రతీ ఇంటికి ఏదో ఒక్క సంక్షేమ పథకం చేర్చడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాల్లో మంత్రితో పాటు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి , పలువురు జిల్లా, నియోజకవర్గ, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్ణీత వ్యవధిలో లబ్ధిదారులు ఇల్లు పూర్తి చేసుకోవాలి

**వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు.**

**హసన్ పర్తి, తెలంగాణ ముచ్చట్లు:**





హసన్ పర్తి మండల పరిధిలోని అన్నసాగర్ జయగిరి సీతంపేట సీతానగరం నాగారం సదునపల్లి కొత్తపల్లి మల్లారెడ్డిపల్లి హరిచంద్ర నాయక్ తండ బైరాన్ పల్లి గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల భూమి పూజా కార్యక్రమంలో కె ఆర్ నాగరాజు లబ్ధిదారుల కుటుంబాలకు బట్టలు పెట్టి ఆశీర్వదించి దళారులకు పైసా ఇవ్వకుండా నిర్ణీత కాలవ్యవధిలో ఇంటి నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు. మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగళ్ళపల్లి తిరుపతి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్రె కిరణ్ కుమార్, మేడిపల్లి మదన్ గౌడ్, చిర్ర విజయ్ కుమార్, ఎంపీడీవో కరుణాకర్ రెడ్డి, తోకల లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



# బలరాం తండా అభివృద్ధికి నిధుల మంజూరుపై ఎమ్మెల్యేను కోరిన గ్రామస్తులు

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు:**

హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని జయగిరి గ్రామపంచాయతీ పరిధిలోని బలరాం తండా అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని గ్రామ ప్రజలు వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజును కలసి వినతిపత్రం అందజేశారు.

గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం, తండా ఏర్పడి అయిదు శతాబ్దాలు గడిచినా ఇప్పటికీ అభివృద్ధి పనులు గణనీయంగా జరగలేదని, రోడ్లు, డ్రైనేజీ, స్మశాన వాటిక, ప్రగతి వనం లాంటి మౌలిక సదుపాయాల కొరత స్పష్టంగా ఉందని విన్నవించారు.

వినతిలో ముఖ్యంగా జీనుకొని కుంట నుంచి శుభనందిని వెంచర్ వరకు రోడ్డును నిర్మించాలని, తండాలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, స్వర్గదామల పథకం కింద స్మశాన వాటిక ఏర్పాటు చేయాలని, అలాగే ప్రగతి వనం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా మునిపల్లె నుంచి బలరాం తండా వరకు బిటుమెన్ రోడ్డు పునరుద్ధరణ చేయాలన్న అంశాన్ని కూడా ప్రస్తావించారు.

తండా వాసుల సమస్యలపై ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజు స్పందిస్తూ, వీలైనంత త్వరగా అవసరమైన అభివృద్ధి పనుల కోసం నిధుల మంజూరు కోసం కృషి చేస్తానని, గ్రామాభివృద్ధి దిశగా పటిష్టమైన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది.

# రాష్ట్ర మంత్రి గా బాధ్యతలు స్వీకరించిన వాకిటి శ్రీహరికి శుభాకాంక్షలు తెలిపిన చిన్నారెడ్డి

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రిగా సోమవారం సచివాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించిన వాకిటి శ్రీహరి ని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని వాకిటి శ్రీహరి ముదిరాజ్ కు సూచించారు. అన్ని వర్గాలను కలుపుకుని ముందుకు సాగాలని, రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లో బలంగా తీసుకెళ్లాలని చిన్నారెడ్డి గారు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉన్నత పదవులు స్వీకరించాలని శ్రీహరి ని ఆశీర్వదించారు.



# పేదల సొంతింటి కల నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం



- సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేఘా రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు
- ఖిల్లా ఘనపూర్ మండల కాంగ్రెస్ నాయకులు మున్నూరు జయాకర్

**వనపర్తి, తెలంగాణ ముచ్చట్లు:**

పేదల సొంతింటి కల నెరవేర్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఖిల్లా ఘనపూర్ మండల కాంగ్రెస్ నాయకులు మున్నూరు జయాకర్ అన్నారు. ఎమ్మెల్యే మెగా రెడ్డి ఆదేశం మేరకు సోమవారం ఖిల్లా ఘనపూర్ మండలం ఆగారం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన ఇండ్ల నిర్మాణానికి అధికారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేసి ముగ్గులు పోయడం జరిగింది. ఈ సందర్భంగా మున్నూరు జయాకర్ మాట్లాడుతూ..తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ఆగారం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పత్రాల పంపిణీ మరియు లబ్ధిదారుల ఇంటి నిర్మాణం కోసం ముగ్గు పోయడం జరిగిందని తెలిపారు. గ్రామంలో 7మందికి ఇండ్లు మంజూరు కావడం సంతోషంగా ఉంది అనీ నాయకులు తెలియజెశారు. ఒకొక్కరికి ఐదు లక్షల చొప్పున సహాయం చేయడం జరుగుతుంది అనీ తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మేఘా రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ నాయకులు మున్నూరు జయాకర్, పంచాయతీ కార్యదర్శి రవి కుమార్, మరియు నాయకులు శ్యాంసుందర్ రావు, నరేష్ కుమార్, రవి కుమార్, కృష్ణయ్య, బాలయ్య, భద్రయ్య శంకరమ్మ, మల్లయ్య ,బాబు మల్లేష్ ,తదితరులు పాల్గొన్నారు.



# సుబేదారి సీఐ రంజిత్ కుమార్ కు శుభాకాంక్షలు తెలిపిన యువకులు

**హన్మకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

హనుమకొండ సుబేదారి పోలీస్ స్టేషన్‌కు కొత్త సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా మేకల రంజిత్ కుమార్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. నూతన పదవికి శుభాకాంక్షలు తెలిపారు. సమాజ శాంతి భద్రతల పరిరక్షణలో మేకల రంజిత్ కుమార్ విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

సిఐ రంజిత్ కుమార్ ని కలిసిన వారిలో యువ నాయకులు తాటికాయల చిరంజీవి,సునీల్, చందు తదితరులు పాల్గొన్నారు

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి

- భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

భవన నిర్మాణ రంగాల కార్మిక సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి నల్ల స్వామి ప్రభుత్వాన్ని ఉద్దేశించి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. 1996లో చట్టం వచ్చినా, ఇప్పటికీ కార్మికుల సంక్షేమ పథకాలు అమలుకాకపోవడం గమనార్హమని పేర్కొన్నారు. గతంలో వచ్చిన ఫైళ్లను అమలు చేయని ప్రభుత్వం, ఇప్పుడు కూడా అదే తంతును కొనసాగిస్తోందని విమర్శించారు.




"ఏండ్లు గడుస్తున్నా కదలని ఫైళ్లకు పరిష్కారం లేదు. ఎప్పటికైనా చేయిస్తామన్న ఫైళ్లపై నమ్మకం కల్పించిన నాయకులు కనుమరుగైపోయారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర గడుస్తున్నా, కార్మికుల ఆకాంక్షలు ఆరిన ఆశలుగా మారాయి. కార్యాలయాల చుట్టూ తిరుగుతూ విసిగిపోయిన లబ్ధిదారులకు ఎప్పటికైనా న్యాయం జరగాలంటూ కోరుతున్నాం," అని ఆయన అన్నారు. సంక్షేమ బోర్డులో వేల కోట్లు ఉన్నా ప్రయోజనం లేకుండా పోయిందని ఆరోపించారు. "గత పదకొండేళ్లుగా బోర్డుకు చైర్మన్ లేని పరిస్థితి కొనసాగుతోంది. కరోనా సమయంలోనే వేల కోట్లు ఖర్చు చేసినా, ఒక్క కార్మికుడికైనా న్యాయం జరిగిందా? పరీక్షల పేరిట సొమ్మును వృథా చేస్తే పరిణామాలు బాధ్యత కల్గించేవి కావచ్చు. ఇప్పటికైనా ఈ దుర్వినియోగాన్ని ఆపాలని డిమాండ్ చేస్తున్నాం," అని నల్ల స్వామి స్పష్టం చేశారు.

అధికారుల నిర్లక్ష్యం వల్ల కార్మికులు అవమానితులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "పొద్దంతా కష్టపడే కార్మికులు అర్ధకాలితో బతుకుతెరువు నెత్తినేసుకొని కుటుంబ పోషణకు పోరాటం చేస్తున్నారు. ఎవరో ఒకరోజు మా కోసం నిలబడతారన్న ఆశతో ప్రభుత్వాన్ని చూశారు. కానీ, ఫలితం శూన్యం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మా సమస్యలను పరిష్కరించాలి," అని సూచించారు.

కార్మిక శాఖ మంత్రిగా వివేక్ వెంకటస్వామిని నియమించడం శుభసూచకమని అభినందించారు. "ఇది కార్మిక లోకానికి నూతన ఆశ. మేము కోరేది ఒక్కటే - కార్మికుల పక్షాన నిలబడి మా సంక్షేమానికి పునాది వేయండి," అని నల్ల స్వామి విజ్ఞప్తి చేశారు.

# నియోజకవర్గ ప్రజలకు అండగా ఉంటా!



- ఎమ్మెల్యే మట్టా రాగమయి

**సత్తుపల్లి, తెలంగాణ ముచ్చట్లు:**

సత్తుపల్లి నియోజకవర్గానికి చెందిన పేద మధ్యతరగతి ప్రజల ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ పార్టీ సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మానవతా దృక్పథంతో ముందడుగు వేస్తున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలలో అనారోగ్యంతో ప్రైవేట్ ఆసుపత్రుల లో ట్రీట్మెంట్ పొందిన వారు ముఖ్యమంత్రి సహాయనిధి సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకోగ ఆన్లైన్ ప్రక్రియను పూర్తి చేయించి సోమవారం హైదరాబాద్ ముఖ్యమంత్రి సహాయనిధి విభాగం లో గల మొత్తం101సిఎంఆర్ఎఫ్ చెక్స్ స్వయంగా తీసుకోని పేద ప్రజలకు అవసరమైన సమయంలో అండగా ఉండడం ప్రజాప్రతినిధిగా తన బాధ్యత అని మీడియాకు తెలిపారు.

# క్లినికల్ శిక్షణ కొరకు జూన్ 28లోగా దరఖాస్తు చేసుకోవాలి

- జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవిబాబు

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

ఇంటర్మీడియట్ ఎం.ఎల్.టి. ఒకేషనల్ కోర్సులో మార్చి 2020 నుండి ఉత్తీర్ణులైన విద్యార్థిని, విద్యార్థులకు ఒక సంవత్సరం క్లినికల్ శిక్షణ ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, తిరుమలాయపాలెం, మధిర, వైరా ఏరియా ఆసుపత్రులలో అందించనున్నట్లు, శిక్షణకు ఎంపికైన వారు వెయ్యి రూపాయలు డి.డి. రూపంలో చెల్లించాలని, గతంలో దరఖాస్తు చేసుకోని, ఎంపిక కాని వారు కూడా తాజాగా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె. రవి బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థిని, విద్యార్థులు తమ బయోడేటా ఫారంతో పాటు పది రూపాయల పోస్టల్ స్టాంప్ అతికించిన స్వంత చిరునామ కవర్, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలను జతపరిచి, కలెక్టర్ లోని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కార్యాలయంలో జూన్ 28 లోగా అందజేయాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## నిబద్ధతగల కమ్యునిస్టు పెరిక ప్రభాకర్

- సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**

సీపీఐ సీనియర్ నాయకులు నేరడ గ్రామానికి చెందిన పేరిక ప్రభాకర్ నిబ్బద్ధత గల కమ్యునిస్టు అని సీపీఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. సోమవారం ఉదయం అనారోగ్యంతో పెరిక ప్రభాకర్ మృతిచెందడంతో విషయం తెలుసుకున్న భాగం నేరడగ్రామానికి చేరుకుని ప్రభాకర్ మృతదవేహం పై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా భాగం హేమంతరావు మాట్లాడుతూ కృష్ణయ్య బ్రతికినంతకాలం ఎర్రజెండాని ఎత్తుకొని పార్టీ అభివృద్ధి కోసం ఎంతగానో కృషిచేశాడన్నారు.ఈ ప్రాంతంలో కమునిస్టు ఉద్యమం బలపడటానికి ఫ్రబాకర్ పాత్ర ఎనలేనిదన్నారు. ఫ్రభాకర్ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

నివాళులర్పించిన వారిలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జుమ్ముల జితేందర్ రెడ్డి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్ర బాబు, సింగు నర్సింహారావు, మేకల నర్సింహారావు, సీఆమహాలక్ష్మి, ఏనుగు వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి పావులూరి మల్లిఖార్జునరావు, సహాయ కార్య దర్శులు దూసరి గోపాలరావు, అబ్బూరి మహేష్, జిల్లా సమితి సభ్యులు దూసరి శ్రీరాములు, నేతాజీ యువజన సంఘం అధ్యక్షులు దూసరి నేతాజీ తదితరులు పాల్గొన్నారు.



## చిల్పూర్‌లో వికసిత భారత్ సంకల్ప సభ

**చిల్పూర్,తెలంగాణ ముచ్చట్లు:**

చిల్పూర్ మండల కేంద్రంలో వికసిత భారత్ సంకల్ప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్ యాదవ్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా జనగాం జిల్లా అధ్యక్షుడు సౌడ రమేష్ హాజరై మాట్లాడుతూ, దేశంలో బీజేపీ ప్రభుత్వం రామ మందిరం నిర్మాణం, నేషనల్ హైవేలు, జనగాం రైల్వే స్టేషన్ ఆధునీకరణ, వరంగల్ విమానాశ్రయం ఏర్పాటు వంటి అభివృద్ధి పనులు చేపట్టిందని అన్నారు.

సభలో జిల్లా ఉపాధ్యక్షులు దేవర ఎల్లయ్య, నవీన్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి తోకల సంపత్ రెడ్డి, మధు నాయక్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పెండ్యాల దిలీప్ కుమార్, మండల ఉపాధ్యక్షుడు కాదుగాయ రమేష్, మండల ప్రధాన కార్యదర్శి వెలిశాల శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే ముక్కెర శ్రవణ్ యాదవ్, సాదం రామరాజు యాదవ్, భీమన్న యాదవ్, కట్ల అనిల్ కుమార్ ముదిరాజ్, తోట రంజిత్ కుమార్, పసుల అశోక్, వెలిశాల సతీష్, దామెర వంశీ, ముక్కెర రమేష్ యాదవ్, మరిపెల్లి రాజు, ముక్కెర గోపాల్ యాదవ్ తదితరులు హాజరయ్యారు.



## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు భూమి పూజ

- వనపర్తి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ ఎంపీపీ రఘు ప్రసాద్

**వనపర్, తెలంగాణ ముచ్చట్లు:**

పెద్దమందడి మండలం చీకరు చెట్టు తాండ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు వనపర్తి మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి పెద్దమందడి మాజీ ఎంపీపీ భూమి పూజ చేశారు. వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆదేశానుసారం సోమవారం మంజూరైన ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల హౌసింగ్ ఏఈ, గ్రామ మాజి సర్పంచ్ వి.రాధాకృష్ణ, దొడగుంటపల్లి వెంకటేశ్వర రెడ్డి , గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రతి సుధా, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎన్. సునీల్ నాయక్, గ్రామ కాంగ్రెస్ కార్యకర్తలు ఎం శంకర్ నాయక్, పి. కిషన్, వి. శ్రీను, పి.బాలు, సురేష్ ,ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు మూడవత్ సునీత రమేష్, పాత్లావత్ జీజా గోపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## లాచర్ల రాజేందర్‌ను పరామర్శించిన బీజేపీ రాష్ట్ర నేత మల్లికార్జున్ రెడ్డి

**కమ్మర్‌పల్లి,తెలంగాణ ముచ్చట్లు:**

నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న బీజేపీ మండల నాయకుడు లాచర్ల రాజేందర్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్ రెడ్డి సోమవారం పరామర్శించారు. రాజేందర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.



ఈ సందర్భంగా మండల బీజేపీ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సున్నం మోహన్, బీజేవైఎం మండల అధ్యక్షుడు కొత్తపల్లి గణేష్, సీనియర్ నాయకులు రేంజర్ల గంగాధర్, నూకల మల్లేష్, కమలాకర్, సంతోష్ రెడ్డి, చింత ప్రవీణ్, కొత్తపల్లి అరుణ్, శ్రీరాముల శ్రావణ్, పోల్కమ్ నవీన్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి...

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ట్విట్టర్, సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులను కూడా సత్వరమే పరిష్కరించాలి
- ప్రజావాణిలో అర్జీలు స్వీకరించిన జిల్లా కలెక్టర్

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**





ప్రజావాణిలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలని, నిబంధనల ప్రకారం మనం ఏదైనా దరఖాస్తు పరిష్కారం చేయలేని సమయంలో కారణాలు తెలియజేస్తూ స్పష్టమైన సమాధానం ఇవ్వాలని అన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను జిల్లా అధికారులు పక్కాగా ట్రాక్ చేయాలని, మండలాల పరిధి నుంచి వచ్చే సమాధానాలు ఎలా ఉంటున్నాయో క్రాస్ చెక్ చేసుకోవాలని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి సమస్య పరిష్కారం కావాలని అన్నారు. ట్విట్టర్, సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే ఫిర్యాదులను కూడా సత్వరమే పరిష్కరించాలని అన్నారు. ప్రజావాణి దరఖాస్తులను ఆన్ లైన్ చేస్తూ ట్రాక్ చేయాలని, ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని, అత్యవసర పరిస్థితుల్లో రాలేని పక్షంలో ముందస్తు అనుమతి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతి సోమవారం నాడు ప్రజావాణి తర్వాత వివిధ శాఖల అధికారులు సమన్వయంతో సమస్యలు త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఖమ్మం జిల్లాలో చాలా మంచి స్టాఫ్ ఉందని, భవిష్యత్తులో మంచి పని తీరు కొనసాగించాలని అన్నారు.

వేంసూర్ మండలం బీరపల్లి గ్రామ ప్రజలు తమ గ్రామంలో ప్రభుత్వ స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణం జరుగుతుందని, వాటిని వెంటనే నిలిపివేసి ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, వేంసూరు మండలం తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకొని రిపోర్ట్ సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం నగరం శ్రీరామ్ హిల్స్ ప్రాంతానికి చెందిన వనమా ఉషారాణి ధంసలాపురం గ్రామ పరిధిలోని సర్వే నెంబర్ 194 లో 2 ఎకరాల వ్యవసాయ భూమి 2008 లో రిజిస్ట్రేషన్ చేసుకున్నానని, ఆ భూమిని ఇతరులు ఆక్రమించారని, భూ భారతి చట్టం ప్రకారం ఆ పట్టా పాస్ పుస్తకం రద్దు చేసి తన పేరున పట్టా పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం అర్బన్ తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు నిబంధనల ప్రకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఖమ్మం నగరం బొక్కల గడ్డ 47వ డివిజన్ కు చెందిన చాట్ల సునీత తాను 15 సంవత్సరాలుగా కిరాయి ఇండ్లలో ఉంటున్నానని తనకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. వేంసూర్ మండలం కందుకూరు గ్రామానికి చెందిన ప్రొద్దుటూరు నాగేశ్వర రావు తమ పంట పొలాలకు రామన్న చెరువు అలుగు నీటినీ మళ్ళింపు చేసి నష్టం చేస్తున్నారని, నష్టం కలిగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్వో ఏ. పద్మశ్రీ, జెడ్పీ సిఈఓ దీక్షా రైనా, డిఆర్డీవో సన్యాసయ్య, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియమాలు, ప్రాముఖ్యత పై పాఠశాల విద్యార్థులకు అవగాహన

- ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**





ట్రాఫిక్ నియమాలను పాటించడం అనేది వ్యక్తిగత భద్రతకు సంబంధించిన విషయం మాత్రమే కాకుండా సమాజానికి దోహద పడే మార్గమని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు అన్నారు. రోజువారీ జీవితంలో ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యత పై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రిక్కబజార్ స్కూల్ లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ...ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యతను విద్యార్థులకు చిన్న వయస్సులోనే నేర్పించడం ద్వారా, విద్యార్థులలో క్రమశిక్షణ మరియు బాధ్యతలను గుర్తు చేస్తాయని అన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం ద్వారా ట్రాఫిక్ సజావుగా సాగుతుందని, అదేవిధంగా రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని, తద్వారా అందరికీ సురక్షితమైన వాతావరణాన్ని సృష్టించవచ్చని అన్నారు. అందులో భాగంగానే సోమవారం స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించిన ఆనంతరం నగరంలోని పలు రోడ్లపై ట్రాఫిక్ నియంత్రణకు పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. ఇటీవల కాలంలో యువత నడుస్తున్నప్పుడు లేదా డ్రైవింగ్ చేస్తున్నప్పుడు సెల్ ఫోన్లు మాట్లాడుతూ.. తరచుగా పరధ్యానంలో ఉంటూ ప్రమాదాలకు గురి అవుతున్నారని ఈ సందర్భంగా గుర్తుచేశారు.

హెల్మెట్లు & సీట్ బెల్టుల వంటి భద్రతా సామగ్రి వినియోగంతో డ్రైవర్లకు రక్షణ కవచాలుగా పనిచేస్తాయని వివరించారు. ముఖ్యంగా వేగ పరిమితులను పాటించడం, డ్రైవింగ్ చేస్తున్నప్పుడు ఫోన్‌లను ఉపయోగించకపోవడం వంటి నియమాలతో ప్రమాదాల అవకాశాలను పూర్తిస్థాయిలో తగ్గిస్తాయని అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ సత్య నారాయణ, ఆర్ ఐ సాంబశివరావు,ఎస్సై రవి,రాము తదితరులు పాల్గొన్నారు.

# కమ్యునిస్టులతోనే హక్కుల సాధన

–సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



దేశంలో కార్మికులు, కర్షకులు ప్రజలకు హక్కులు సాధించి పెట్టడంలో కమ్యూనిస్టు పార్టీలు కీలక పాత్ర పోషించాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. సోమవారం సిపిఐ చింతకాని మండల 17వ మహాసభ లచ్చగూడెం గ్రామంలో అమరజీవి బాల నాగేందర్ రెడ్డి ప్రాంగణంలో కూచిపుడి రవి, మార్గం శ్రీను ,గుండ్ల బేబీ రాణి ల అధ్యక్షతన జరిగింది. తొలుత మహాసభల ప్రారంభ సూచికంగా ఏర్పాటు చేసిన అరుణ పతాకాన్ని బాగం హేమంత రావు ఆవిష్కరించారు. అమర వీరుల స్మారక స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో బాగం హేమంతరావు మాట్లాడుతూ వందేళ్లుగా సిపిఐ, కమ్యూనిస్టు పార్టీలు దేశానికి ఏమి చేశాయని కొంత మంది అవివేకులు మాట్లాడుతున్నారని ఆయన తెలిపారు. భారత దేశ. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని స్వాతంత్ర్యం తర్వాత కూడా ప్రజల, కార్మికుల, కర్షకుల హక్కుల కోసం అనునిత్యం సిపిఐ పోరాటం చేస్తుందన్నారు. సిపిఐ తో పాటు ఇతర కమ్యూ నిస్టు పార్టీలు కలిసి పోరాటం చేయడం వల్లనే దేశంలో జమీందారులు, జాగీర్దారులు, పటేల్ పట్వారీ వ్యవస్థలు రద్దయ్యాయన్నారు. ఎంతో మంది భూములు లేని పేదలకు భూములు కల్పించిందన్నారు. ఏఐటియుసి ఆధ్వర్యంలో చేసిన పోరాటాల ఫలితంగా 44 కార్మిక హక్కుల చట్టాలను కల్పించుకున్నారు. సిపిఐ ఆధ్వర్యంలో చేసిన పోరాటాలు అజరామరమన్నారు. ప్రస్తుత యువతకు కూడా కమ్యూనిస్టు పార్టీ అవశ్యకత గురించి తెలపాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో రాచరిక వ్యవస్థను నిర్మూలించడానికి వైజాం నిరంకుశ పాలనను పారద్రోలడానికి సిపిఐ అలుపెరుగని పోరాటం చేసిందన్నారు. కమ్యూ నిస్టు పార్టీ చేసిన పోరాటాలు నేటి యువత తెలుసుకోవాలన్నారు. పాలకులు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధా నాలపై పోరాటాలు సాగించాలన్నారు. సిపిఐ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. పేద ప్రజలకు ఇండ్లు కట్టించాలని మొట్టమొదటి సారి అసెంబ్లీలో ప్రస్తావించింది కమ్యూనిస్టులేనని ఆయన తెలిపారు. 1973లో ప్రతిపక్ష నేతగా ఉన్న సిపిఐ శాసన సభ్యులు మహ్మద్ రజబ్ధలీ పేదలకు ఇండ్లు కట్టుకోవడానికి ఐదువేలు మంజూరు చేయాలని అడగగా అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఒప్పుకున్నారన్నారు. అప్పుడు కమ్యూనిస్టులు అడిగిన ఐదువేల రూపాయల నుంచి ఇప్పుడు ఐదు లక్షల వరకు ఇల్లు కట్టుకోవడానికి ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుందంటే అది కమ్యూనిస్టుల చలువేనన్నారు. 2006లో రైతులకు రుణమాఫీ చేయా లని బ్యాంకుల ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో 48 గంటల పాటు ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహిస్తే అవహేళన చేశారని రైతులకు రుణమాఫీ ఎలా చేస్తారని ఎద్దేవా చేశారన్నారు. ఇప్పుడు రుణమాఫీ చేయడానికి ప్రభుత్వాలు ముందుకు వచ్చాయని ఆయన తెలిపారు. ప్రభుత్వ రంగ ఆస్తులు కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నారన్నారు. బీజేపీ హయాంలో మతోన్మాదం హెచ్చుమీరుతుందన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించడంలో మోడీ పూర్తిగా విఫలమయ్యారన్నారు. రాష్టంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేయాలని లేని పక్షంలో కేసిఆర్ కు పట్టిన గతి పడుతుందన్నారు. ఆరుగ్యారెంటీలు రైతు రుణమాఫీ,రైతు భరోసా తక్షణమే అమలు చేయాలన్నారు.పంటల భీమా పథకాన్ని అమలు చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరి చేయాలన్నారు. ప్రజా సమస్యలపై సిపిఐ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు.స్థానిక సంస్థలు ఎన్నికల్లో పార్టీ సత్తా చాటాలన్నారు.ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి కొండపర్తి గోవిందరావు ,జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి రవీంద్రబాబు సింగు నరసింహారావు, మేకల నరసింహారావు, సీతామాలక్ష్మి ,వ్యకాస జిల్లా కార్యదర్శి ఏసు , పార్టీ మండల కార్యదర్శి పావులూరు మల్లికార్జున రావు, జిల్లా సమితి సభ్యులు దూసరి శ్రీరాములు, రాసాల మోహన్ రావు బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, చింతకాని మండల సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్ , దూసరి గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

**నూతన కార్యదర్శిగా దూసరి గోపాలరావు**

చింతకాని మండల నూతన కార్యదర్శిగా దూసరి గోపాలరావు , సహాయ కార్యదర్శులుగా అబ్బూరి మహేష్, మార్గం శ్రీనుతో పాటు 48 మందితో నూతన కమిటీ ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



# ఇట్లు భాషా సేవకుడు... తిరుమల రామచంద్ర

**జూన్ 17... తిరుమల రామచంద్ర జయంతి**

పండితుల సొత్తుగా భావించబడే సాహిత్యాన్ని ప్రజాపరం చేయాలనే లక్ష్యంతో, లక్ష్య సిద్ధి కోసం యావజ్జీవం పాటుపడ్డారు తిరుమల రామచంద్ర. తెలుగు సాహిత్యంలో పత్రికా రంగాలలో ఆయన ప్రాతః స్మరణీయులు. ప్రాకృత, సంస్కృతాంధ్ర సారస్వతాల్లో నిష్ణాతునిగా, ద్రావిడ భాషల పరిశోధకునిగా విశిష్ట సేవలందించారు. స్వాతంత్ర్య సమర యోధునిగా, మద్రాసు కుట్రకేసులో ముద్దాయిగా స్వాతంత్ర్య పోరాట కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు. సరళమైన, సలక్షణమైన, సహజ సుందరమైన తెలుగు భాషకు పట్టం కట్టి, భావి తరాలకు ముఖ్యంగా పత్రికా రచయితలకు మార్గదర్శకు లయ్యారు. తిరుమల రామచంద్ర స్వయాన వరిష్ఠ పత్రికా రచయిత మాత్రమే కాదు, జగమెరిగిన పండితులు, పరిశోధకులు, విమర్శకులు, బహు భాషావేత్త, బహు గ్రంథకర్త, పత్రికా రచయితగా ఆయన చేసిన భాషాసేవ అనన్య సామాన్యం.

మాతృభాష తెలుగుతో పాటు కన్నడ, తమిళ, సంస్కృతం, ప్రాకృతాది భాషల్లో ప్రావీణ్యం కలిగిన బహు భాషావేత్త. రకరకాల వృత్తులు చేసి, వివిధ అనుభవాలు సంపాదించి విస్తృత లోకానుభవ శాలి ఐన రామచంద్ర తనను తాను వినమ్రంగా భాషా సేవకుడు అని అభివర్ణించు కునేవారు.


బిరుదులు, అవార్డులు, గౌరవ డాక్టరేట్లు ఎన్ని వరించినా కలకత్తా సర్వభాషా పత్రకార్ సమ్మేళనంలో స్వీకరించిన "పత్రకార్ శిరోమణి" అనే బిరుదొక్కటే తమ పేరు ముందు రాసుకోడానికి ఇష్టపడేవారు.

లాహోర్ విశ్వవిద్యాలయ గ్రంథాలయంలో ఏడాదిపాటు పనిచేసి తెలుగు, కన్నడ, తమిళ, మళయాల తాళపత్ర గ్రంథాలు వెయ్యింటికి వివరణ సూచీ తయారు చేశారు.

అనంతపురం జిల్లా ధర్మవరం తాలూకా రేగటిపల్లె లో 1913, జూన్ 17న జన్మించిన రామచంద్ర హంపీ శిథిలాలలోని గ్రామమైన కమలాపురంలో తన బాల్యం గడిపారు. ఆయన విజయనగర సామ్రాజ్యంలో నివసించిన తాతాచార్యుల వంశీయులు. సంస్కృత భాష, శాస్త్రాలను గురు శుశ్రూష చేసి నేర్చుకోవడం ప్రారంభించాక కారణాంతరాల వల్ల తిరుపతి లోని కళాశాలలో చేరారు. తెలుగు, సంస్కృతాలలో విద్వాన్ గా, హిందీలో ప్రభాకరగా పట్టాలు పొందారు.

స్వాతంత్ర్య సమర యోధునిగా మద్రాసు కుట్ర కేసులో ముద్దాయిగా స్వాతంత్ర్య సమరంలో పాలుపంచు కున్నారు. తిరుపతిలో చదువు తున్నపుడు సత్యాగ్రహంలో పాల్గొని ఏడాది జైలు శిక్ష అనుభవించారు. సహాయ నిరాకరణ సభల కోసం మార్చింగ్ సాంగ్స్ రాశారు.

ద్వితీయ ప్రపంచ యుద్ధ కాలంలో సైన్యంలో హవల్దార్ గుమాస్తాగా ఆఫ్ఘనిస్థాన్, బెలూచిస్థాన్, సరిహద్దుల్లో పని చేశారు. ఆ ఉద్యోగాన్ని ఆత్మ గౌరవానికి భంగం కలిగిన కారణంగా విడిచి పెట్టిన రామచంద్ర ఆ సమయంలోనే ఉత్తర భారత దేశంలో విస్తృతమైన పర్యటన చేశారు. ఉమ్మడి పంజాబులో భాగమైన లాహోర్ పట్టణంలో కొందరు మహా పండితులను, పంజాబు పల్లెల్లో భారతీయ గ్రామీణ జీవితం, మొహెంజదారో, హరప్పా ప్రాంతాల్లో ప్రాచీన నాగరికతా చిహ్నాలను దర్శించారు.



వేటూరి ప్రభాకర శాస్త్రికి ఏకలవ్య శిష్యునిగా చెప్పుకున్న తిరుమల రామచంద్ర, విద్వాన్ విశ్వం వంటి సహాధ్యాయులతో పనిచేశారు. అనంతరం ఢిల్లీ వచ్చి డెయిలీ టెలిగ్రాఫ్ ఆంగ్ల పత్రికలో చేరి పాత్రికేయ వృత్తిలో స్థిరపడ్డారు. 1944 లో పత్రికా రంగంలో పనిచేశారు. తొలుత తెలంగాణ పత్రికలో పనిచేసి తర్వాత మీజాన్ లో చేరి ఆ పత్రిక సంపాదకుడు అడవి బాపిరాజు శిష్యరికంలో రాటుదేలారు.

సురవరం ప్రతాపరెడ్డి, రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ఆరుట్ల దంపతులతో ఏర్పడిన సాన్నిహిత్యంతో సోషలిష్టు భావజాలానికి దగ్గరయ్యారు. ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక, ఆంధ్రభూమి, హిందుస్తాన్ సమాచార్ లలో వివిధ హోదాలలో పనిచేశారు. భారతి మాసపత్రిక ఇన్ చార్జ్ ఎడిటర్ గా పనిచేసిన కాలంలో దేవరకొండ బాలగంగాధర తిలక్ వ్యాసం ప్రచురించిన కారణంగా తలెత్తిన భేదాభి ప్రాయాలతో రాజీనామా చేశారు. నార్ల వెంకటేశ్వరరావు తో విభేధించి ఆంధ్రప్రభలో ఉద్యోగం వదులు కున్నారు.

పరిశోధన అనే ద్వైమాస పత్రికకు సంపాదకత్వం వహించి 19531956 మధ్య కాలంలో ప్రచురించారు. రామచంద్ర కొన్ని వందల వ్యాసాలు సమీక్షలు రాశారు. "హైదరాబాద్ నోట్ బుక్" వంటి 15 శీర్షికలు నిర్వహించారు. సత్యాగ్రహ విజయం నాటకం, రణన్నినాదం గీతాన్ని సంస్కృతంలో రాశారు.

తిరుమల రామచంద్ర తన 84 ఏళ్ళ జీవితంలో అర్ధ శతాబ్ది పత్రికా రచనకే అంకితమైనారు. తెలుగు నాట, భారతావనిలో ప్రసిద్ధులైన కవిపండితులు, కళాకారులు, భాషావేత్తలు, తత్త్వ చింతకులు అయిన ప్రతిభా శాలురు అనేక మందిని ఆయన ఇంటర్వ్యూ చేశారు. సుమారు 50 పుస్తకాల దాకా ఆయన రచనలు అచ్చైనాయి.

'మన లిపి పుట్టు పూర్వోత్తరాలు' భాషా చరిత్రకే తలమానికం. ఇతర భాషలలో కూడా ఇలాంటి రచన లేదని" ఆంధ్ర విశారద తాపీ ధర్మారావు కితాబు ఇచ్చారు. ఆయన ప్రకటించిన 'లలిత విస్తరం' బౌద్ధ వాజ్మయం నుంచి ఆధునిక భారతీయ భాషలలో తొలి అనువాదం. మహాయాన బౌద్ధ సంప్రదాయానుసారం రాసిన బుద్ధుని జీవిత చరిత్ర ఇది. భారత దేశంలో మొట్టమొదటి లౌకిక వచనంగా దీన్ని పేర్కొన్నారు. క్షేమేంద్రుడి 'అవధాన కల్పలత'ను కూడా ఆయన అనువదించారు. తెలుగులో వీరిదే తొలి అనువాదం.

చిన్నతనం లోనే భారత దేశపు సాంస్కృతిక వైశాల్యాన్ని దర్శించిన రామచంద్ర ఆ కారణంగా తన దృక్పథంలో ఏర్పడ్డ సమ్యక్ దృష్టి, సంస్కృతి పట్ల ప్రేమను జీవితాంతం నిలబెట్టుకున్నారు. నార్ల వెంకటేశ్వరరావుతో విభేదాలు, "భారతి" పత్రికలో ఒక వ్యాసం గురించిన వివాదాలు వంటి సందర్భాల్లో రాజీనామాలు చేసి తన ఆత్మగౌరవాన్ని ప్రదర్శించారు. గాంధీని దర్శించారు. వారితో హరిజనోద్యమంలో పాల్గొన్నారు. ఖద్దరు దుస్తులు కట్టేవారు. నాస్తికునిగా, హేతువాదిగా ప్రకటించుకున్న ఆయనే దేవాలయంలో పూజ చేయడం, ఉన్నవ లక్ష్మీనారాయణ వద్ద సహాయకునిగా పౌరోహిత్యం వంటివి చేశారు. ప్రతి ఉత్తరంలోనూ "ఇట్లు భాషాసేవకుడు తిరుమల రామచంద్ర" అంటూ సంతకం చేసే రామచంద్ర భాషాసేవ లోనే జీవితాన్ని గడిపారు.


పత్రకార శిరోమణి, కళా సరస్వతి, మహా మహోపాధ్యాయ తదితర బిరుదులు ఆయనను వరించాయి. 1991లో ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, గుంటూరు జిల్లా శాఖ వారిచే అమరజీవి పులుపుల వెంకట శివయ్య సాహితీ సత్కారం, 1993లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి సాంస్కృతిక రంగంలో విశిష్ట పురస్కారం పొందారు.

తెలుగు నుడికి బడికట్టి, తెలుగు అక్షర రమ్యతను జగతికి చాటిన పరిశోధన 'రాముడు', సారస్వత 'చంద్రుడు' తిరుమల రామచంద్ర

1997 అక్టోబరు 12న తమ 84వ ఏట హైదరాబాద్ లో చివరి శ్వాస వదిలారు.

## అందరికీ అందని అతిలోక సుందరి..!

(ఏ ఐ సృష్టించిన ఊహల ఊర్వశి)



ప్రకృతిని
ఆరాధించు...
అందాలను
ఆస్వాదించు...
నీకు ఊపిరులూదిన
పంచభూతాలను ప్రేమించు...
హాయిగా ప్రశాంతంగా జీవించు..!

కానీ...మాయా ప్రపంచపు
తలుపుల్ని తియ్యకు...తీస్తే
ఒప్పులకుప్ప వయ్యారి భామ
గాలిలో ముద్దులు విసురుతుంది..!

ఆమె...కాలిమువ్వల సవ్వడితో
మురిపించే ఓ ముద్దుగుమ్మ...
ఆమె...అందాలు ఆరబోసే...
ఓ బంగారు బాపుబొమ్మ...!

ఆమె...కుర్రకారును రెచ్చగొట్టే
కులుకు నడకల తళుకు బెళుకుల తార
కొంటెచూపులతో కోర్కెలు రగిలించే...
మన్మధ బాణాలతో మదిని దోచే...
వలపు వలలు విసిరే...వయ్యారి...
మత్తు కన్నుల మయూరి...!

కానీ మత్తెక్కించే ఆ మల్లె మొగ్గ
బుగ్గలపై ముత్యాలముగ్గులు వేయాలని...
ఆ కలలరాణిని కౌగిలించుకోవాలని...
ఊహాలోకంలో ఊరేగకు...
చిలిపి చూపులతో చిత్తుచేసే ఆ రంగుల
రామచిలుకతో ఆడుకోవాలని ఆశపడకు..!

ఆమె...లేత బుగ్గల్ని నిమరాలని...
ఆమె...పెదవులపై ప్రేమ సంతకం పెట్టాలని..
చిలిపి నవ్వులతో చిత్తు చేసే
కాటుక కళ్ళతో కాటేసే ఆ కలికి పై
కవిత్వం వ్రాయాలని...కలలు కనకు...!

ఆమె...భావాలకు సంగీతం కాదు...
కలలకు సుస్వరమే...
ఆమె...తలపులు...
చిరునవ్వుల చిగురులు కావు
కలల పరిమళాలే...కారణం..!

ఆమె..."భూలోక సుందరి" కాదు...
బ్రహ్మ సృష్టి కాదు...
ఆమె..."ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్"
సృష్టించిన...
ఒక "అభినవ అప్సర"...
ఒక "ఊరించే ఊర్వశి"...
ఒక "మెరుపుతీగ మేనక"...
కవ్వించే ఓ "కలల రాణి"....
అందరికీ అందని ఓ "అతిలోక సుందరి"..!



రచన:
కవిరత్న సాహిత్య ధీర
సహస్ర కవి భూషణ్ పోవలయ్య
కూకట్లపల్లి, అత్తాపూర్,
హైదరాబాద్

## మీదే రాజ్యం!



నోట్లు పోసి
ఓట్లు కొని
సీట్లు ఎక్కి
పాట్లు పడేది
ప్రజల కోసమా?
వాళ్ళ రూట్లు
మార్కెట్లు!
లాభాలు!
దొంగల దోపిడి!

దేశాన్ని
మార్చాలంటే
ప్రజల్ని
మార్చండి!
మార్చేవాళ్లెవరు?
ఎవరైనాసరే!
ముందు మీలో
ఐక్యతవుందా?
చూసుకోండి!

ఇదే సమయం!
ప్రజలంతా
ఈ కులం మతం
పార్టీలతో
విసిగిపోయారు!
కమ్యూనిస్టులూ
ముందుకురండి!
అంబేడ్కరిస్టులూ
ఐక్యమవ్వండి!

వచ్చే ఎన్నికల్లో
విజయం మీదే!
ప్రయత్నించండి!
ఇది పేదల పార్టీ
లాల్ నీల్ మైత్రి
పులకించు ధాత్రి!
ఓట్లు మీవే
సీట్లు మీవే
మీదే రాజ్యం
మీరేలండి!

**తమ్మినేని అక్కిరాజు**
హైదరాబాద్

## ప్రథమ స్వాతంత్ర్య సమర యోధురాలు ఝాన్సీ లక్ష్మీబాయి

**ఆధునిక భారతదేశ చరిత్రలో బ్రిటిష్ వలస పాలన, విధానాలకు వ్యతిరేకంగా జరిగిన గొప్ప చారిత్రక సంఘటనే '1857 సిపాయిల తిరుగుబాటు'. బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీ... బెంగాలు నవాబు, ఆయన ఫ్రెంచి మిత్రుల కూటమికి 1757 జూన్ 23న ప్లాసీ నిర్ణయాత్మక యుద్ధం జరగగా, తర్వాత వందేళ్లకు ఈ తిరుగు బాటు చోటు చేసుకుంది. దీనినే 'ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం', 'సిపాయిల పితూరి', 'విప్లవోద్యమం'గా చరిత్రకారులు అభివర్ణించారు. వీరసావర్కర్ తాను రచించిన గ్రంథం ఇండియన్ వార్ ఆఫ్ ఇండిపెండెన్స్ లో సిపాయిల తిరుగుబాటు ప్రథమ స్వాతంత్ర్య సమరమని పేర్కొనడం జరిగింది. ఉత్తర, మధ్య భారత దేశంలో బ్రిటిషు ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య యుద్ధం వైఫల్యంతో ముగిసింది. 1857 మే 10న మీరట్లోని బెంగాల్ అశ్విక దళంలో కొందరు సైనికులు ఢిల్లీవైపు రావడంతో ప్రారంభమైన తిరుగుబాటు, వేగంగా ఉత్తర భారతం మొత్తానికి నిస్తరించింది. మీరట్, ఝాన్సీ, కాన్పూర్, లక్నోలు తిరుగుబాటు తలెత్తిన ముఖ్య ప్రాంతాలు.**

**ఉత్తర భారత దేశ రాజ్యమైన ఝాన్సీ అనే రాజ్యానికి రాణి. 1857లో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించింది. భారత దేశంలోని బ్రిటిష్ పరిపాలనలో ఝాన్సీ కీ రాణి గ ప్రసిద్ధికెక్కినది.1857 లో భారత దేశ తిరుగుబాటు దార్లలో ముఖ్యమైన వాళ్ళలో ఆమె ముఖ్యమైనది.**

**ఝాన్సీ లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక. ఆమె 1828వ సంవత్సరం నవంబరు19 న మహారాష్ట్ర కు చెందిన సతారలో ఒక కర్హాడీ బ్రాహ్మణుల వంశంలో వారణాసిలో విక్రమ నామ సంవత్సరం బహుళ పంచమీ నాడు జన్మించింది. లక్ష్మీబాయికి 13 ఏళ్ళ వయసు లోనే 1842లో ఝాన్సీ పట్టణానికి రాజైన గంగాధరరావు నెవల్కార్ తో వివాహమైంది. దీంతో ఆమె ఝాన్సీ పట్టణానికి మహారాణి అయింది. అప్పటి ఆచారాల ప్రకారం మహారాణి అయిన తర్వాత ఆమె పేరు లక్ష్మీబాయి అయింది. 1851లో లక్ష్మీబాయికి ఒక కుమారుడు జన్మించాడు. అయితే ఆ పిల్లవాడు నాలుగు నెలల వయసులోనే కన్ను మూశాడు. 1853 లో గంగాధర రావుకు అనారోగ్యం సోకింది. వేరే బిడ్డను ఎవరినైనా దత్తత తీసుకోమని అందరూ సలహ ఇచ్చారు. దాంతో ఆయనకు దూరపు బంధువైన వాసుదేవ నేవల్కర్ కుమారుడైన దామోదర్ రావు అనే పిల్లవాడిని చని పోవడానికి కేవలం ఒక్క రోజు ముందుగానే దత్తత తీసుకున్నారు. 1853, నవంబర్ 21 వ తేదీన గంగాధరరావు మరణించాడు.**

**హిందూ సాంప్రదాయం ప్రకారం దామోదర్ రావు రాజ్యానికి వారసుడు కావల్సి ఉన్నా బ్రిటీష్ ప్రభుత్వం అందుకు అంగీకరించలేదు. దామోదర్ రావు రాజా కు రక్త సంబంధం కానందు వలన అంటే దత్త సంబంధం కావున, ఈస్ట్ ఇండియా కంపనీ గవర్నర్**



**జనరల్ లార్డ్ డల్ హౌసి, సిద్ధాంతం ప్రకారం రావు సింహాసనాన్ని అధిష్టించే అధికారం లేదని అతనిని నిరాకరించాడు. రాణి ఝాన్సీని ఇవ్వకూడదని నిశ్చయించు కొన్నది. ఆమె తన సైన్యాన్ని బలపర్చి, తమకు తాముగా వచ్చిన వాళ్ళను పోగుచేసి ఒక సేనను తయారు చేసింది. మహిళలకు కూడా యుద్ధ శిక్షణ ఇవ్వబడిరది. యుద్ధ వీరులైన గులాం గాస్ ఖాన్, దోస్త్ ఖాన్, ఖుదా బక్ష్, లాల భు బక్షి, మోతీ బాయి, సుందర్ - ముందర్, ఖాసి బాయి, దీవాన్ రఘునాథ్ సింగ్, దీవాన్ జవహర్ సింగ్ రాణి బలగంలో ఉన్నారు. అలా జరిగిన యుద్ధంలో లక్ష్మీబాయి 1858 జూన్ 17 న గ్వాలియర్ లో యుద్ధ సమయములో మరణించింది.**

**గ్వాలియర్ యుద్ధం గురించి జనరల్ రోస్ ప్రస్తావిస్తూ విప్లవ కారుల్లోకెల్లా ఆమే అత్యంత ధైర్య సాహసాలతో పోరు సల్పిందని కితాబిచ్చాడు. ఆమెకున్న ధైర్యము, పరాక్రమము, వివేకము, భారత దేశంలో 19 వ శతాబ్దములో మహిళలకున్న అధికారం పై ఆమెకున్న ముందుచూపు, ఆమె చేసిన త్యాగాలు ఆమెను స్వాతంత్ర్య పోరాటంలో ఒక ప్రసిద్ధ వ్యక్తిగా నిలిపింది. "జోన్ ఆఫ్ ఆర్క్" లాగా ఆమె భారత దేశ చరిత్రలో ఒక గొప్ప వ్యక్తిగా నిలిచిపోయింది.**

# అప్పగించిన అధిష్టానం....



మంత్రి వర్గ విస్తరణాలో జిల్లాకు మరోసారి నిరాశే ఎదురైంది. జిల్లా చరిత్రలోనే మొదటిసారిగా జిల్లాకు మంత్రి మండలిలో ప్రాతినిధ్యం లేకుండా పోయింది. దిగ్గజ నేతలున్న జిల్లాలో దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉంది. ఇద్దరు నేతలకు మూడు సార్లు పిసిసి పగ్గాలు అప్పగించిన కాంగ్రెస్ అధిష్టానం ఈసారి జిల్లాకు మంత్రి పదవి ఇవ్వడానికి వెనుకాడుతుంది. తొమ్మిది అసెంబ్లీ సెగ్మెట్ లున్న ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే నలుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. మరోసారి బిఆర్ఎస్ ఎమ్మెల్యే సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ నుంచి గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలలో ముగ్గురు మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన వారే. బోధన్ ఎమ్మెల్యే పి. సుదర్శన్ రెడ్డి ఒకరే మూడుసార్లు గెలిచారు.

అందులోనూ ఆయన గతంలో మంత్రి గా పని చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా ముద్ర ఉంది. సమీప బంధువు కూడా. అందులో రేవంత్ పిసిసి పగ్గాలు దక్కడంలో తెర వెనుక మంత్రాంగం నడిపారు. ఇకేముంది రేవంత్ క్యాబినెట్ లో ఆయన బెర్త్ ఖాయమని భావించారు. మొదటి దఫాలో తనకు మంత్రి పదవి వస్తుందనే భరోసాతో సుదర్శన్ రెడ్డి ఉండే. కానీ తానోకటి తలిస్తే దైవం మరొకటి తల్చినట్లుగా అధిష్టానం ఆయనకు స్పీకర్ బాధ్యతలు తీసుకోవాలని కోరారు. మంత్రిగా పని (%ఔశీతీస ఎఱఅఱర్‌వతీ%) చేయడానికి సిద్ధం అయిన స్పీకర్ బాధ్యతలు తీసుకోవడానికి ఆసక్తి చూపలేదు. దీంతో రేవంత్ క్యాబినెట్ లో ఆయన బెర్త్ దక్కలేదు. కానీ పదేళ్లు పార్టీ అధికారంలో లేకపోయినా ప్రతికూల పరిస్థితులు తట్టుకొని కాంగ్రెస్‌లో కొనసాగుతూ వచ్చారు. జిల్లా పార్టీకి పెద్ద దిక్కుగా వ్యవహరించారు.

సమాజంగా మంత్రి పదవి రాకపోవడంతో సుదర్శన్‌రెడ్డి ఆసంతృప్తికి గురయ్యారు. కానీ విస్తరణ ఎప్పుడు జరిపిన మంత్రి పదవి గ్యారేంటే అని ముఖ్యమంత్రి పదే పదే భరోసా ఇచ్చారు. దీంతో ఈసారి మంత్రి వర్గ విస్తరణ ఎప్పుడు జరిగిన తనకు మంత్రి పదవి ఖాయమనే ధీమాతో సుదర్శన్ రెడ్డి ఉంటున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిన మొదట్లో పాలన వ్యవహారాలలో ప్రోటోకాల్ సైతం పక్కకు పెట్టి పని చేశారు. కానీ మంత్రి పదవి విషయంలో ఎడతెగని జాప్యం సాగుతుండడంతో సైలెంట్ అయ్యారు. పదేళ్ల తర్వాత పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ పాలన వ్యవస్థలో ప్రాధాన్యత లేకపోవడంతో పార్టీ శ్రేణుల్లో అసహనం వ్యక్తం అయ్యింది. ఎమ్మెల్యేలు సైతం ఎవరికివారే యమునా తీరన్నట్లుగా వ్యవహరించడంతో పార్టీ విధేయులను పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు.

ఈనేపథ్యంలో మంత్రి విస్తరణపై ఆశావహులతో పాటు పార్టీ శ్రేణుల్లో ఎదురు చూపులు మొదలయ్యాయి. దాదాపు ఏడాదిన్నర నిరీక్షణ తర్వాత అధిష్టానం విస్తరణకు లైన్ క్లియర్ చేసింది. కేవలం ముగ్గురికి అవకాశం ఇవ్వాలని, సామాజిక సమీకరణ ప్రతిపాదన ఉండాలని మెలిక పెట్టింది. అదే సుదర్శన్‌రెడ్డికి ప్రతికూలంగా మారింది. బిసి, ఎస్సీలకే మంత్రి పదవులు ఇస్తున్నట్లు ముందుగానే సంకేతాలు రావడంతో అప్రమత్తం అయినా సుదర్శన్‌రెడ్డి విస్తరణకు రెండు రోజుల ముందు హుటాహుటిన ఢిల్లీకి వెళ్లారు. కానీ ఢిల్లీ పెద్దల నుంచి సానుకూల హామీ దక్కకపోవడంతో వెనుదిరిగిన సుదర్శన్ రెడ్డి అప్పటి నుంచి ఇంటికే పరిమితమయ్యారు. పార్టీలో అత్యంత సీనియర్ నేతగా ఉన్న తనకు మంత్రి పదవి నిరాకరించడంతో ఆయన తీవ్ర మనస్తాపం చెందారు. ఒకదశలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయబోతున్నారటూ ప్రచారం తెరమీదికి వచ్చింది. పార్టీ శ్రేణుల్లో ఆగ్రహం పెల్లు బికింది.

హైదరాబాద్‌లో ఉన్న ఏఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ విస్తరణ రోజే రంగంలోకి దిగారు. పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి సుదర్శన్ రెడ్డి ఇంటికి వెళ్లి భవిష్యత్తుకు భరోసా ఇచ్చి బుజ్జగించారు. పార్టీ కోసం పదేళ్లు కష్టపడి పని చేసిన తనలాంటి సీనియర్‌కు మంత్రి పదవి ఇవ్వకపోవడం అవమానకరంగా భావిస్తున్నట్లు ఆయన ఆవేదనగా చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లా మంత్రి లేకపోతే సానుకూల ఫలితాలు సాధించడం అంతా సులువేమి కాదని నేతలు చెప్తున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏపార్టీ అధికారంలోకి వచ్చినా జిల్లాకు రెండేసి మంత్రి పదవి దక్కాయి. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోనూ మంత్రి పదవితో పాటు స్పీకర్ పోస్టు కూడ దక్కింది. మంత్రి వర్గంలో తన సొంత జిల్లాకు ప్రాతినిధ్యం ఉండాలని పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సైతం అధిష్టానం పెద్దల మీద ఒత్తిడి చేస్తున్నారు. తదుపరి విస్తరణలోనైనా దిగ్గజ నేతగా ఉన్న సుదర్శన్ రెడ్డికి ఊరట దక్కుతుందా లేదా..? వేచి చూడాలి..!

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# మంత్రి వాకిటి శ్రీహరికి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

- మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వాకిటి శ్రీహరి

**హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు:**

పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, క్రీడలు, యువజన సర్వీసుల శాఖల మంత్రి గా నియమితులైన వాకిటి శ్రీహరి సోమవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు.
ఈ సందర్భంగా సచివాలయానికి చేరుకున్న ఆయనకు పండితులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వాగతం పలికారు. అనంతరం తనకు కేటాయించిన శాఖల కార్యాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అధికారికంగా విధులు చేపట్టారు.ఈ సందర్భంగా షాద్‌నగర్ ఎమ్మెల్యే మరియు ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ మంత్రి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.

# భూ భారతి చట్టం"తో దళితులకు న్యాయం జరగాలి

- ఏండ్ల తరబడి ఆక్రమణలో దళితుల భూదాన్ భూములు
- క్రయవిక్రయాలు జరపకూడని భూదాన భూములు, భూస్వాములు క్రయం పేరుతో రికార్డులలో నమోదు చేయించుకోవడం గమనార్హం
- భూ భారతి చట్టాన్ని అధికారులు పటిష్టంగా అమలు చేయాలి

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



భూదాన యజ్ఞ బోర్డు ద్వారా భూమిలేని నిరుపేదలకు భూమి చెందే విధంగా, ఆచార్య వినోబాభావే ద్వారా దళితులకు పంచిన భూమి ఏండ్లుగా ఆక్రమణకు గురై ఉందని, దరఖాస్తులు పరిశీలించి భూ భారతి చట్టంతో అర్హత కలిగిన దళితులకు న్యాయం చేయాలని కొరకొప్పుల రాంబాబు, సీతారాములు, శ్రీను అధికారులను వేడుకున్నారు. సోమవారం ఖమ్మం జిల్లా, ఏనుకూరు మండల పరిధిలోని మేడిపల్లి రెవెన్యూ గ్రామంలో భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవిన్యూ అధికారులు ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. భూ సమస్యల సత్వర పరిష్కారంకొరకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ భారతి చట్టాన్ని అధికారులు పటిష్టంగా అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారన్నారు. 1950లో ఆచార్య వినోబాభావే భూమిలేని నిరుపేదలకు భూదాన యజ్ఞ బోర్డు ద్వారా భూములను పంచి ఇచ్చారు. అందులో భాగంగా ఏన్కూర్ లోని దళితులకు మేడేపల్లి సర్వే నెంబర్ 76 లో గల 9.20 ఎకరాల మెట్ట భూమిని పంచి ఇచ్చారు. అట్టి భూమి ఎన్నో ఏండ్లుగా ఆక్రమణకు గురై ఎన్ని సార్లు అధికారులకు దరఖాస్తులు చేసిన ఫలితం దక్కలేదన్నారు. అట్టి భూమిని భూస్వాములు క్రయం పొందినట్టు నాటి కొందరి అధికారుల చొరవతో రికార్డులలో అక్రమ పద్ధతిలో ఎక్కించుకొని అనుభవిస్తున్నారని ఆరోపించారు. భూ భారతి చట్టంతోనైనా దళితుల భూ సమస్య పరిష్కారం కావాలని వారు కోరారు.

# డాక్టర్ ఆరిఫ్ కు సుమన్ టీవీ 2025 డాక్టర్స్ అవార్డు ప్రధానం

**ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:**



ఖమ్మం జిల్లా ప్రముఖ ఆర్థోపెడిక్ మరియు కీళ్ల వ్యాధి నిపుణులు డాక్టర్ ఆరిఫ్ కి సుమన్ టీవీ 2025 డాక్టర్ అవార్డ్స్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ నోవా టెల్ హోటల్ లో జరిగిన అవార్డు ఫంక్షన్లో 11 సంవత్సరాల సేవకు గాను అవార్డు ప్రదానం చేయటం జరిగింది ఖమ్మం జిల్లా సింగరేణి హాస్పిటల్ లో తన వైద్య వృత్తిని ప్రారంభించి అక్కడ ఎంతోమంది సింగరేణి ఉద్యోగులకు వైద్య సేవలు అందించి ఖమ్మం కు చెందిన ప్రముఖ హాస్పిటల్ లో పనిచేసే సొంతగా షిఫా హాస్పిటల్ స్థాపించి అంతర్జాతీయ స్థాయి పరిమాణాలతో కీళ్ల మార్పిడి వెన్నుముక సర్జరీస్ ఆర్తోస్కోపీ సర్జరీ లు మరియు కీళ్ల వ్యాధి నిపుణులుగా మంచి పేరు ప్రఖ్యాతి సంపాదించారు వారి సతీమణి డాక్టర్ అస్మా స్త్రీ మరియు ప్రసూతి వైద్య నిపుణురాలు నార్మల్ డెలివరీ మరియు సంతాన సమస్యల నిపుణురాలు.

# ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే రూ. లక్ష ప్రోత్సాహకం

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**

ఇద్దరు దివ్యాంగులు వివాహం చేసుకుంటే వారికి ప్రత్యేక ప్రోత్సాహకంగా రూ. లక్షను బ్యాంక్ ఖాతాలో జమ చేయనున్నట్లు మహిళ, శిశు, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ హనుమకొండ జిల్లా కార్యాలయం ప్రకటించింది. ఇప్పటి వరకు దివ్యాంగులు, సాధారణ వ్యక్తి మధ్య జరిగే వివాహాలకు కళ్యాణ లక్ష్మీతో పాటు రూ. లక్ష ప్రోత్సాహకాన్ని ప్రభుత్వం అందిస్తుండగా, ఇప్పుడు ఇద్దరూ దివ్యాంగులైన దంపతులకూ ఇదే విధంగా ప్రయోజనం వర్తింపజేయనుంది. ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేసినట్లు జిల్లా సంక్షేమాధికారి జె. జయంతి ఒక ప్రకటనలో తెలిపారు.
ఈ పథకానికి అర్హతలు ఇలా ఉన్నాయి:
•వధువు కనీసం 18 సంవత్సరాలు, వరుడు 21 సంవత్సరాలు నిండినవారై ఉండాలి.
ఇవ్ ఇద్దరూ తెలంగాణ రాష్ట్రానికి చెందినవారై ఉండాలి.
•ఇద్దరూ దివ్యాంగులై, ప్రభుత్వం జారీ చేసిన దివ్యాంగుల గుర్తింపు పత్రం కలిగి ఉండాలి.
•వివాహం జరిగిన తరువాత ఒక సంవత్సరం లోపల దరఖాస్తు చేయాలి.
దరఖాస్తుదారులు అవసరమైన ధ్రువీకరణ పత్రాలతో ఈ పథకానికి సంబంధించిన దరఖాస్తును తెలంగాణ ఈపాస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్లైన్లో సమర్పించవచ్చని జిల్లా సంక్షేమాధికారి తెలిపారు.

# ప్రజావాణిలో అర్జీలను తక్షణమే పరిష్కరించాలి

- హన్మకొండ,కలెక్టర్ స్నేహ శబరీష్

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**





ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను సంబంధిత శాఖలు వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వేగంగా స్పందించాలన్నారు.
జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ స్నేహ శబరీష్ జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి వచ్చిన 145 అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ, గృహనిర్మాణ, భూ సర్వే, విద్యుత్, మున్సిపల్, విద్య, పోలీస్, సాగునీటి పారుదల, ఆర్ అండ్ బి, ఎక్సైజ్, ఆరోగ్య, కుడా, ఉపాధి, వ్యవసాయ, మైన్స్, కోశాధికారి తదితర శాఖల సంబంధిత అంశాలపై వచ్చిన ఫిర్యాదులను ఆమె పరిశీలించారు. అర్జీలు అందుకున్న వెంటనే సంబంధిత శాఖల అధికారులు వాటిపై స్పందించి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి. గణేష్, గ్రామీణ అభివృద్ధి అధికారి మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేష్, డాక్టర్ కె. నారాయణ, సిపిఓ సత్యనారాయణ రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**వర్ధన్నపేట,తెలంగాణ ముచ్చట్లు:**





వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద వ్యవసాయ మార్కెట్‌లో రైతు వేదికలో "రైతు నేస్తం" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, జిల్లా కలెక్టర్ సత్య శారద దేవి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి హైదరాబాదులో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1031 రైతు వేదికలను లాంఛనంగా ప్రారంభించారు. అలాగే ఎకరానికి ₹6000 చొప్పున రైతు భరోసా నిధులను విడుదల చేశారు.
కార్యక్రమంలో మాట్లాడిన ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ, వ్యవసాయ రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇప్పటివరకు దాదాపు ₹78,000 కోట్లను రైతు సంక్షేమానికి ఖర్చు చేసినట్లు తెలిపారు. ఒక్కసారిగా రైతు రుణమాఫీ చేయడం ద్వారా తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. భవిష్యత్తులో వ్యవసాయ భూములకు సంబంధించిన రైతుల ఖాతాల్లో భరోసా నిధులు నేరుగా జమ చేయనున్నట్లు తెలిపారు.
రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా నూతన పంటల సాగు అవసరమని సూచించిన ఎమ్మెల్యే, తాను స్వయంగా 5 ఎకరాల్లో పామాయిల్ తోట ఏర్పాటు చేశానని తెలిపారు. వరి, పత్తి వంటి సాంప్రదాయ పంటలపై మాత్రమే ఆధారపడకుండా ఇతర లాభదాయక పంటల వైపు కూడా రైతులు దృష్టి సారించాలన్నారు.
ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి అనురాధ, ఏవో విజేందర్, రైతులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# హసన్ పర్తి మండలంలోని పలు గ్రామాల్లో ఇండ్లకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే నాగరాజు

**హసన్ పర్తి,తెలంగాణ ముచ్చట్లు:**





హనుమకొండ జిల్లా హసన్పర్తి మండల పరిధిలోని మడిపల్లి, అనంతసాగర్, జయగిరి, సీతంపేట, సీతానాగారం, నాగారం, సుధనపల్లి, కొత్తపల్లి, మల్లారెడ్డిపల్లె, హరిచంద్రనాయక్ తండా, బైరానపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు భూమి పూజ కార్యక్రమాలు నిర్వహించారు.
ఈ కార్యక్రమాల్లో వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు పాల్గొని, లబ్ధిదారులకు సంకేతంగా బట్టలు పంపిణీ చేశారు.
ప్రభుత్వం నిర్దేశించిన కాలపరిమితిలో ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలని సూచించారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 22,500 కోట్ల వ్యయంతో 4.5 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం ప్రారంభించినట్లు తెలిపారు. వర్ధన్నపేట నియోజకవర్గంలో రూ.175 కోట్లతో 3,500 ఇళ్ల నిర్మాణం జరుగుతుందని చెప్పారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున నాలుగు విడతల్లో నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ కానున్నట్లు వివరించారు.
ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా, రాజకీయాలకు అతీతంగా జరిగిందని తెలిపారు. నియోజకవర్గానికి వచ్చిన 18 వేల దరఖాస్తుల్లో 12 వేల పైగా అర్హులను గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రతి అర్హుడికీ ఇల్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని, ఎవరూ ఆందోళన చెందవద్దని హామీ ఇచ్చారు. ఇల్లు మంజూరైయ్యేందుకు ఏవైనా దోపిడీలు జరగకుండా పకడ్బందీగా వ్యవహరిస్తామని, ఎవరైనా లబ్ధిదారుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలిసిన పక్షంలో వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పథకాల అమలులో అవినీతికి తావులేని విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు.
గత ప్రభుత్వ హయాంలో డబుల్ బెడ్‌రూమ్ పథకం పేరుతో ప్రజలు మోసపోయారని పేర్కొన్నారు. ప్రస్తుతం తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఉచిత సన్న బియ్యం, రైతులకు క్వింటాకు రూ.500 బోనస్, ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలు అమలవుతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగెళ్లపల్లి తిరుపతి, మండల పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, పాక్స్ చైర్మన్ బిల్లా ఉదయ్ కుమార్ రెడ్డి, ఇతర జిల్లా నాయకులు, మహిళా నేతలు, యువజన నాయకులు, గ్రామస్థాయి నాయకులు, లబ్ధిదారులు, అధికారులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి లక్ష కోట్లు ఖర్చు చేసిన తెలంగాణ ప్రభుత్వ

**హనుమకొండ,తెలంగాణ ముచ్చట్లు:**





రైతులు లాభసాటి పంటల సాగుపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రైతుల సంక్షేమానికి ఒకటిన్నర సంవత్సర కాలంలో రూ.70 వేల కోట్ల వ్యయం చేసిన ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనని చెప్పారు.
ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి నిర్వహించిన కార్యక్రమంలో సీఎం కొత్తగా ప్రవేశపెట్టిన "రైతు నేస్తం" పథకాన్ని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్ కె. రామకృష్ణారావుతో కలిసి ప్రారంభించారు.
ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రైతు భరోసా, రుణమాఫీ, ధాన్యం కొనుగోలు, ఉచిత విద్యుత్తు, బీమా, పరిహారం, బోనస్ కలిపి రాష్ట్రం గత 18 నెలల్లో రూ.1,01,728 కోట్లు రైతుల కోసం ఖర్చు చేసినట్లు తెలిపారు. రైతుల ఖాతాల్లో 9 రోజుల్లో రూ.9 వేల కోట్లు జమ చేయనున్నట్టు పేర్కొన్నారు.
రైతులకు అవసరమైన వ్యవసాయ పనిముట్లు, సబ్సిడీలు, సాంకేతిక సహాయంతో పాటు భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి ద్వారా చక్కటి ప్రణాళికలు అమలవుతున్నాయని తెలిపారు. రైతులు సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసి అదనంగా ఆదాయం పొందేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు.
డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గత పాలకుల నుండి అప్పుల్లో కూరుకుపోయిన ఆర్థిక పరిస్థితిని ఎదుర్కొంటూ, రైతుల సంక్షేమానికి రూ.70 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. రైతు కూలీలకు రూ.12 వేల ఆర్థిక సహాయం అందుతోందని చెప్పారు. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా వరి సాగు చేస్తున్నది తెలంగాణ రైతేనని, రుణమాఫీగా ఇప్పటికే రూ.21 వేల కోట్ల మేర చెల్లింపులు చేసినట్లు వెల్లడించారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి కూడా భారీగా నిధులు కేటాయించామన్నారు. ముఖ్య కార్యదర్శి కె. రామకృష్ణారావు మాట్లాడుతూ రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా తెలంగాణ రైజింగ్ 2047 ప్రణాళిక అమలులో ఉందని, సాంకేతికత వినియోగంతో రైతులను భద్రతతో ముందుకు తీసుకెళ్లే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసన సభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, కుడా చైర్మన్ వెంకటరామిరెడ్డి, వ్యవసాయ శాఖాధికారి రవీందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.


తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక


# ఇజ్రాయెల్-ఇరాన్ ఉద్రిక్తతలపై ట్రంప్ కఠిన వ్యాఖ్యలు

**వాషింగ్టన్**

ఇజ్రాయెల్ దాడుల ఉద్ధృతి పెరగడం.. అమెరికా స్వరం కఠినంగా మారుతుండటంతో ఇరాన్ అరబ్ మిత్ర దేశాల ద్వారా రాయబారం పంపినట్లు తెలుస్తోంది. అయితే ముందు అణు ఒప్పందానికి రావాలని టెహ్రాన్‌కు ట్రంప్ నిక్కచ్చిగా చెప్పారు. జీ7 దేశాల సదస్సు సందర్భంగా ఆయనే స్వయంగా ఈవిషయాన్ని వెల్లడించారు. ఉద్రిక్తతలు చల్లార్చే విషయంపై చర్చలకు రావాల్సింది గా టెహ్రాన్ కోరిందన్నారు.

''ఇరాన్ ఈ యుద్ధం గెలవదని నేను చెప్పాను. వారు పరిస్థితి చేజారిపోక ముందే కచ్చితంగా చర్చలు జరపాలి'' అని సూచించినట్లు జీ7 ప్రారంభ సమయంలో ట్రంప్ రిపోర్టర్లకు వెల్లడించారు. అప్పుడు కెనడా ప్రధాని మార్క్ కార్నీ కూడా అక్కడే ఉన్నారు. ఈ సంక్షోభాన్ని ముగించి.. చర్చలకు సిద్ధమన్నట్లు ఇరాన్ అరబ్ మిత్రులకు సంకేతాలు పంపిందన్న వార్తలు వచ్చిన వేళ ట్రంప్ ఈవిధంగా స్పందించడం గమనార్హం. ఈ సంక్షోభాన్ని త్వరగా ముగించాలని గల్ఫ్ దేశాలు కూడా వాషింగ్టన్‌ను కోరినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్‌ను యుద్ధం ఆపేటట్లు ఒత్తిడి చేయాలని అమెరికాను సౌదీ, ఖతార్, ఒమన్ దేశాలు అభ్యర్థించినట్లు తెలుస్తోంది. ఈ ఉద్రిక్తతలు పెరిగి ఈ ప్రాంతంలోని చమురు వసతులు దెబ్బతినే ప్రమాదం ఉన్నట్లు అవి ఆందోళన వ్యక్తంచేశారు.



**కాల్పుల విరమణ అంశాన్ని ట్రంప్ పరిశీలిస్తున్నారు : మేక్రాన్**

ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ జరిపించే అంశాన్ని ట్రంప్ పరిశీలిస్తున్నారని ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ తెలిపారు. అదే సమయంలో ఇరాన్‌లో ప్రభుత్వాన్ని కూలదోయాలన్న ఇజ్రాయెల్ ఆలోచన వ్యూహాత్మక తప్పిదంగా మిగులుతుందన్నారు.

'' వారు కలిసి మాట్లాడుకోవాల్సిన అవసరం ఉంది. కాల్పుల విరమణ, చర్చల ప్రారంభానికి అవసరమైన ఓ ప్రతిపాదన వెళ్లింది. దానిని ఇరుపక్షాలు పాటిస్తాయేమో వేచి చూస్తున్నాం. పశ్చిమాసియాలో పరిస్థితి వెంటనే మారుతుందని నేను అనుకోను. కానీ, అమెరికా కాల్పుల విరమణకు మార్గం వెతుకుతానని హామీ ఇచ్చింది. ఈనేపథ్యంలో ఇజ్రాయెల్ ఒత్తిడి పెంచి పరిస్థితిలో మార్పును తెచ్చే అవకాశం ఉంది'' అని పేర్కొన్నారు. అదే సమయంలో ఇరాన్, ఇజ్రాయెల్ పౌరులపై బాంబింగ్ చేయడం మానుకోవాలని ఫ్రాన్స్ కోరింది.

మరోవైపు ఇరాన్ అణ్వాయుధాలను మర్చిపోవాల్సిందేనని ట్రంప్ సోషల్ మీడియాలో తేల్చిచెప్పారు. ''ఇరాన్ డీల్‌పై సంతకం చేయాలి. వారికి ఆ విషయం నేను చెప్పాను. వృథాగా ప్రాణాలు పోవడం సిగ్గుచేటు. 'ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండదు' అని నేను మళ్లీ మళ్లీ చెబుతున్నాను. టెహ్రాన్‌ను అందరూ తక్షణమే ఖాళీ చేయాలి'' అని పేర్కొన్నారు.

# సైప్రస్ అధ్యక్షుడికి ప్రధాని మోదీ ఇచ్చిన భారతీయ సంప్రదాయ బహుమతులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని మోదీ విదేశాలకు వెళ్లినప్పుడు అక్కడి నేతలకు భారతీయ సంప్రదాయాలు, సంస్కృతిని చాటిచెప్పే బహుమతులు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోంది.

సైప్రస్ అధ్యక్షుడికి ఇచ్చిన కాశ్మీరీ సిల్క్ కార్పెట్‌కు ఎన్నో విశిష్టతలు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. కాశ్మీర్ లోయలోని కళాకారులు శతాబ్దాల నాటి కుట్టు నైపుణ్యాలను ఉపయోగించి, దీన్ని తయారు చేశారని చెప్పారు. అసలు సిసలైన మల్బరీ పట్టు, సహజసిద్ధమైన రంగులు వాడినట్లు పేర్కొన్నారు. ఇక వెండి క్లచ్ పర్సు కూడా విలువైందేనని అన్నారు. సంప్రదాయ లోహపు పనితనం, ఆధునిక రీతులను మేళవించి దీన్ని రూపొందించి







నట్లు వెల్లడించారు. పర్సుపై ఉన్న పూల డిజైన్లు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కళాకారుల నైపుణ్యానికి ఇదొక నిదర్శనమని స్పష్టంచేశారు.



# దేశవ్యాప్తంగా 16వ జనగణన, కులగణనకు కేంద్రం గ్రీన్‌సిగ్నల్

(మొదటి పేజీ తరువాయి)

మంచు అధికంగా కురిసే లద్దాఖ్, జమ్ము కశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో 2026 అక్టోబర్ 1 నుంచి జనగణన ప్రారంభమవుతుంది. దేశంలోని మిగిలిన ప్రాంతాలలో 2027 మార్చి 1వ తేదీ నుంచి జనగణన మొదలవుతుంది.

**34 లక్షల మంది ఎన్యూమరేటర్లు**

దేశవ్యాప్తంగా జనాభా లెక్కల సేకరణను 34 లక్షల మంది ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు నిర్వహిస్తారు. సుమారు 1.3 లక్షల మంది సెన్సస్ నిర్వాహకులు డిజిటల్ పరికరాలతో పాల్గొంటారు. జనగణనతోపాటు కులగణన కూడా జరుగుతుందని ప్రభుత్వం సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. జనగణన ఏర్పాట్లపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదివారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రెండు విడతలలో జనగణనని నిర్వహిస్తారు. మొదటి విడతలో హౌస్‌లిస్టింగ్ ఆపరేషన్(హెచ్ఎల్ఓ), ప్రతి ఇంటి పరిస్థితులు, ఆస్తులు, సౌకర్యాలు సేకరిస్తారు. రెండవ విడతలో ఇంటింటి జనాభా లెక్కలు, ప్రతి ఇంటిలోని ప్రతి సభ్యుడి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక వివరాలు సేకరిస్తారు. జనాభా లెక్కల సేకరణ దేశంలో ప్రారంభమైనప్పటి నుంచి ఇది 16వది. స్వాతంత్ర్యం తర్వాత ఇది 8వ సారి. జనాభా లెక్కల సేకరణ, వాటిని డిజిటల్ రూపంలో బదిలీ చేయడం, భద్రపరచడం వంటి అంశాలలో గట్టి భద్రతా ఏర్పాట్లు తీసుకుంటున్నట్లు ప్రభుత్వం తెలిపింది.

**రూ.13,000 కోట్ల అంచనా వ్యయం**

దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జనగణన కోసం ప్రభుత్వానికి రూ. 13,000 కోట్లు ఖర్చవుతుందని అంచనా. రాజ్యాంగంలోని 246 అధికరణ ప్రకారం ఏడో షెడ్యూల్‌లో 69వ అంశంగా జనగణన పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి చెందిన జనాభా లెక్కలను సేకరించవలసి ఉంటుంది. రానున్న జనాభా లెక్కల సేకరణలో కుల గణనను కూడా స్వాతంత్ర్యానంతరం మొట్టమొదటిసారి ప్రభుత్వం చేర్చింది. చివరిసారి కులాల వారీగా గణాంకాల సేకరణ 1881 నుంచి 1931 మధ్య బ్రిటిష్ పాలకులు చేశారు. స్వాతంత్ర్యం తర్వాత నిర్వహించిన అన్ని జనగణనల్లో కుల గణనను ప్రభుత్వాలు మినహాయించాయి. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఏప్రిల్ 30న జరిగిన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. 2010లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ కులగణనను క్యాబినెట్‌లో ఆమోదిస్తామని లోక్‌సభలో హామీ ఇచ్చారు. అయితే అప్పటి కాంగ్రెస్ సారథ్యంలోని యూపీఏ ప్రభుత్వం కుల గణనను నిర్వహించడానికి బదులుగా సామాజికఆర్థిక , కుల గణన పేరిట సర్వే వైపు మొగ్గు చూపింది.

# వైద్య కళాశాలల పనులపై కార్యాచరణ ప్రణాళిక

- **కళాశాలల్లో క్షేత్ర స్థాయి పరిశీలనకు అధికారులతో కమిటీ**
- **మూడేళ్లలో అన్ని కళాశాలలు పూర్తి స్థాయి వసతులతో ఉండాలి**
- **నర్సింగ్ కళాశాలల్లో ఆప్షనల్‌గా జపనీస్ ఉండాలి...**
- **వైద్యారోగ్య సమీక్షలో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి**



ప్రతి నెల వైద్యారోగ్య, విద్యా శాఖలపై సమీక్ష

హైదరాబాద్: రాష్ట్రంలోని 34 వైద్య కళాశాలలు పూర్తి స్థాయి వసతులతో పని చేయాలని, ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను వెంటనే తయారు చేయాలని ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందుకోసం అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని, ఆ కమిటీ ప్రతి కళాశాలను సందర్శించి అక్కడ ఏం అవసరాలు ఉన్నాయి... ఎంత మేర నిధులు కావాలి.. తక్షణమే పూర్తి చేయాల్సిన పనులు... ప్రభుత్వపరంగా అందించాల్సిన సహాయం తదితర వివరాలతో నివేదికను సమర్పించాలని సీఎం ఆదేశించారు. వైద్యారోగ్య శాఖపై ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఐసీసీసీలో సోమవారం ఆ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) రాష్ట్రంలోని వైద్య కళాశాలలకు సంబంధించి లేవనెత్తిన పలు అంశాలపై చర్చించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నియామకాలు, బోధన సిబ్బందికి ప్రమోషన్లు, వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆసుపత్రుల్లో పడకల పెంపు, ఆయా కళాశాలలకు అవసరమైన వైద్య పరికరాలు, ఖాళీల భర్తీ వీటన్నింటిపై సమగ్ర నివేదిక రూపొందించి అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదల చేయాల్సిన నిధులను వెంటనే విడుదల చేస్తామని సీఎం తెలిపారు. కేంద్ర ఆరోగ్య శాఖ నుంచి నిధులు, అనుమతులకు సంబంధించిన అంశాలుంటే వెంటనే తెలియజేయాలని, కేంద్ర మంత్రి నడ్డా, ఆ శాఖ అధికారులను సంప్రదించి వాటిని పరిష్కరిస్తామని సీఎం పేర్కొన్నారు. నర్సింగ్ కళాశాలల్లో జపనీస్ (జపాన్ భాష) ను ఒక ఆప్షనల్‌గా నేర్పించాలని, జపాన్‌లో మన నర్సింగ్ సిబ్బందికి డిమాండ్ ఉందని సీఎం తెలిపారు. ఈ విషయంలో మనకు మద్దతు ఇచ్చేందుకు జపాన్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం వెల్లడిరచారు. ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారిని పరీక్షించే వైద్యులు, ఆసుపత్రుల సమయాల పర్యవేక్షణకు ఒక యాప్‌ను వినియోగించే అంశంపై అధ్యయనం చేయాలని సీఎం అధికారులకు సూచించారు. విద్యా, వైద్య రంగాలు ఎంతో కీలకమని, ప్రతి నెలా మూడో వారంలో ఈ రెండు శాఖలపై సమీక్ష నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమీక్షలో రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి కార్యదర్శి మాణిక్ రాజ్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జడ్ చోంగ్తూ, వైద్యారోగ్య శాఖ డైరెక్టరేట్ డాక్టర్ నరేందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

దేవుడు దిగివచ్చినా మున్సిపల్ అధికారుల తీరును అర్థం చేసుకోవడం సాధ్యం కాదని హైకోర్టు మండిపడింది. కళ్ల ముందే అంతస్తులకు అంతస్తులు భవన నిర్మాణం జరుగుతున్నా కబోదుల్లా వ్యవహరిస్తున్నారని.. తీరా నిర్మాణం పూర్తయ్యాక విధులు గుర్తుకొచ్చి కూల్చివేత అంటూ హడావుడి చేస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేసింది.

రాష్ట్రంలో అడ్డగోలుగా వెలుస్తున్న అక్రమ నిర్మాణాలకు మున్సిపల్ అధికారులే బాధ్యులని చెప్పింది. దీనికి సంబంధించి జీహెచ్ఎంసీ న్యాయవాదిపై హైకోర్టు ప్రశ్నల వర్షం కురిపించగా.. ఆయన ఎలాంటి సమాధానం చెప్పలేకపోయారు.

'నెలల తరబడి భవన నిర్మాణమంతా పూర్తయ్యే వరకు మున్సిపల్ అధికారులు ఏం చేస్తుంటారు? ఆ ప్రాంతంలోని ఏరియా ఇన్‌స్పెక్టర్లు కళ్లు మూసుకుని తిరుగుతుంటారా? సెక్షన్ 461 ప్రకారం నిర్మాణం ప్రారంభంలోనే సీజ్ చేసే అధికారమున్నా ఎందుకు చేయరు? ఎవరో పిటిషన్ వేస్తే.. కోర్టు ఆదేశాలు జారీ చేస్తే.. తర్వాత స్పీకింగ్ ఆర్డర్స్ ఇస్తారు. స్పీకింగ్ ఆర్డర్స్ ఇచ్చేలోపు భవన నిర్మాణం పూర్తవుతుంది.

అప్పుడు కూల్చివేత అంటూ హడావుడి ప్రారంభిస్తారు.. రాష్ట్రంలో ఏటా వెలుస్తున్న అనధికార నిర్మాణాలను ఎందుకు ఆపలేకపోతున్నారు? విచిత్రమేంటంటే.. అక్రమ నిర్మాణం చేసేటప్పుడు వారికి కనిపించదు.. కానీ, పన్ను వసూలుకు మాత్రం ఆ భవనం కనిపిస్తుంది.. దాని వివరాలన్నీ తెలుస్తాయి. నిర్మాణం పూర్తయిన తర్వాత అధికార దర్పాన్ని ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తుంటారు. మునిసిపల్‌అధికారులను దేవుడు కూడా బాగుచేయలేడు. ప్రజలకు మునిసిపల్ అధికారులు, న్యాయవాదులు, కోర్టుల గురించి తెలుసు. అధికారుల తీరు మారకపోతే భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవు'అని తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేశారు.

**క్రమబద్ధీకరణపై నిర్ణయం వరకు యథాతథస్థితి**

జీహెచ్ఎంసీ చట్టం-1955లోని సెక్షన్ 462 కింద చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నోటీసు జారీ చేయడాన్ని సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గుట్టల బేగంపేట్‌కు చెందిన కె.రఘువీర ఆచారి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు.

పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. భవనం కూల్చివేస్తామంటూ అధికారులు నోటీసులు జారీ చేయడం చట్టవిరుద్ధమన్నారు. భవన క్రమబద్ధీకరణ పథకం (బీఆర్ఎస్) కింద దరఖాస్తు చేసుకున్నామని, నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన నోటీసులను నిలుపుదల చేయాలని కోరారు. బీఆర్ఎస్ దరఖాస్తుపై నిర్ణయం తీసుకునే వరకు ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

వాదనలు విన్న న్యాయమూర్తి.. భవన నిర్మాణం పూర్తయ్యే వరకు చర్యలు తీసుకోకపోవడాన్ని తప్పుబట్టారు. చాలాప్రాంతాల్లో అక్రమ నిర్మాణదారులకు అధికారులు సహకరిస్తున్నారని, అందుకే నిర్మాణాలు పూర్తయ్యే వరకు చర్యలు తీసుకోవడం లేదని అభిప్రాయపడ్డారు.

పిటిషనర్ సమర్పించిన క్రమబద్ధీకరణ దరఖాస్తును పరిశీలించి నిర్ణయం తీసుకునే వరకు యథాతథస్థితిని కొనసాగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతివాదులను కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ.. విచారణను జూలై 15కు వాయిదా వేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# హేజిల్‌వుడ్‌పై జాన్సన్ విమర్శలు



ఆస్ట్రేలియా ఫాస్ట్‌బౌలర్ హేజిల్‌వుడ్.. దేశం కన్నా ఐపీఎల్‌కే ప్రాధాన్యమిస్తున్నాడని మాజీ పేసర్ మిచెల్ జాన్సన్ అన్నాడు. ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్లో దక్షిణాఫ్రికా చేతిలో ఆసీస్ ఓడిన నేపథ్యంలో జాన్సన్ స్పందించాడు. ''గత కొన్నేళ్లలో హేజిల్‌వుడ్ ఫిట్‌నెస్‌పై ఆందోళన వ్యక్తమైంది. జాతీయ జట్టు సన్నాహల కన్నా ఆలస్యమైన ఐపీఎల్‌కు అతడు ప్రాధాన్యమిస్తూ లీగ్ కోసం తిరిగి వెళ్లడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి'' అని జాన్సన్ అన్నాడు. ఈ ఏడాది ఐపీఎల్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరపున హేజిల్‌వుడ్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. 22 వికెట్లతో ఆ జట్టు టైటిల్ గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. కానీ డబ్ల్యూటీసీ ఫైనల్లో మాత్రం రెండే వికెట్లు పడగొట్టగలిగాడు. ఐపీఎల్ చివరి దశలో గాయపడ్డ హేజిల్‌వుడ్.. తర్వాత కోలుకుని, డబ్ల్యూటీసీ ఫైనల్ సమీపిస్తున్న దశలో ఐపీఎల్ ప్లేఆఫ్స్ ఆడిన నేపథ్యంలో జాన్సన్ అతడిపై విమర్శలు గుప్పించాడు. తమ బౌలింగ్ విభాగం డబ్ల్యూటీసీ ఫైనల్లో ఒకప్పటంత ప్రభావవంతంగా కనిపించలేదని, ఇకపై ప్రత్యామ్నాయాలు చూడాల్సిన అవసరముందని జాన్సన్ అభిప్రాయపడ్డాడు. ''స్టార్క్, హేజిల్‌వుడ్, కమిన్స్, లైయన్‌లతో కూడిన బౌలింగ్ దళం ఒకప్పట్లా అద్భుతాలు చేస్తుందని అనిపించట్లేదు. వారికే కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. సీనియర్ ఆటగాళ్లు యాషెస్‌తో కెరీర్‌కు వీడ్కోలు పలకాలని అనుకుంటుంటే ఆ భావన సరైందేనా అని చూడాలి. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని టెస్టు ఆటగాళ్లను ఎంచుకోవడం మంచిది'' అని జాన్సన్ అన్నాడు.

# వన్డే వరల్డ్‌కప్ ఫిక్చర్స్ విడుదల..

మహిళల వన్డే వరల్డ్‌కప్ ఫిక్చర్స్‌ను ఐసీసీ ఇవాళ (జూన్ 16) విడుదల చేసింది. ఈ మెగా టోర్నీ ఈ ఏడాది సెప్టెంబర్ 30నవంబర్ 2 మధ్యలో భారత్, శ్రీలంక వేదికగా జరుగనుంది. ఈ టోర్నీ హైబ్రిడ్ మోడల్‌లో జరుగనుంది. ఈ టోర్నీలో పాకిస్తాన్, శ్రీలంక ఆడే మ్యాచ్‌లకు శ్రీలంక ఆతిథ్యమివ్వనుంది. భారత్‌శ్రీలంక మ్యాచ్ మాత్రం భారత్‌లోనే జరుగనుంది.

టోర్నీ ఆరంభ మ్యాచ్‌లో (సెప్టెంబర్ 30) టీమిండియా శ్రీలంకతో బెంగళూరు వేదికగా తలపడనుంది. అక్టోబర్ 29న తొలి సెమీఫైనల్ (గౌహతి లేదా కొలొంబో (పాక్ క్వాలిఫై అయితే)), 30న రెండో సెమీఫైనల్ (బెంగళూరు) జరుగనున్నాయి. నవంబర్ 2న ఫైనల్ (బెంగళూరు లేదా కొలొంబో) జరుగుతుంది. మహిళల వన్డే వరల్డ్‌కప్ 12 ఏళ్ల తర్వాత భారత్‌లో జరుగుతుంది. భారత్‌లోని చిన్నస్వామి స్టేడియం (బెంగళూరు), ఏసీఏ స్టేడియం (గౌహతి), హోల్కర్ స్టేడియం (ఇండోర్), ఏసీఏవీడీసీఏ స్టేడియంలో (విశాఖపట్నం) మ్యాచ్‌లు జరుగుతాయి. శ్రీలంకలో ప్రేమదాస స్టేడియంలో (కొలంబో) మ్యాచ్‌లు జరుగుతాయి.

ఈ టోర్నీలో మొత్తం ఎనిమిది జట్లు (భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్, శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్) పాల్గొంటాయి. ఈ టోర్నీలో ఆస్ట్రేలియా డిఫెండింగ్ ఛాంపియన్ హోదాలో బరిలోకి దిగుతుంది. 2022లో న్యూజిలాండ్‌లో జరిగిన ప్రపంచ కప్ ఫైనల్లో ఆస్ట్రేలియా ఇంగ్లండ్‌ను ఓడించి ఏడోసారి ఛాంపియన్‌గా అవతరించింది. ఈ టోర్నీలో అత్యంత విజయవంతమైన జట్టు ఆస్ట్రేలియానే.





# షకీబ్ అల్ హసన్‌కు బంగ్లాదేశ్ కోర్టు షాక్

బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ షకీబుల్ హసన్ వరుసగా చిక్కుల్లో పడుతున్నాడు. ఇప్పటికే చెక్ బౌన్స్ కేసులో అతడిపై అరెస్ట్ వారెంట్ జారీ అయింది. నిరుడు డిసెంబర్ నుంచి జట్టుకు దూరమైన అతడు తాజాగా మరోసారి కష్టాల్లో పడ్డాడు. అతడిపై నమోదైన అవినీతి కేసు ను విచారిస్తున్న ఢాకా కోర్టు సోమవారం ఈ ఆల్‌రౌండర్‌కు పెద్ద షాకిచ్చింది. సదరు కోర్టు షకీబ్‌పై ట్రావెల్ బ్యాన్ విధించింది. అతడితో పాటు మరో 15 మందికి కూడా ఈ నిషేధం వర్తిస్తుందని న్యాయస్థానం తెలిపింది.

అవినీతి నిరోధక కమిషన్ దాఖలు చేసిన రెండు వేర్వేరు పిటిషన్లను విచారించిన ఢాకా మెట్రోపాలిటన్ సీనియర్ స్పెషల్ జడ్జ్ ఎండీ. జకీర్ హొస్సేన్ సోమవార తీర్పును వెలువరించారు. స్టాక్ మార్కెట్‌లో అక్రమంగా కోట్లాది రూపాయల పెట్టుబడులు పెట్టారు. ఇది స్టాక్ మార్కెట్ నియమావళిని షకీబ్ ఉల్లఘించారు.

దాంతో, ఏసీసీ అతడితో పాటు అతడికి సహకరించిన 15 మందిపై కేసు వేసింది. బంగ్లాదేశ్ టాకాలో 8.97 కోట్లు, 4.48 కోట్ల టాకాలను సేకరించడం ద్వారా సెక్షన్ 19(1)లోని 24(3) రూల్‌ను షకీబ్ అతిక్రమించారని కోర్టుకు విన్నవించింది ఏసీసీ. దాంతో, కోర్టు దేశం విడిచి వెళ్లకుండా అతడిపై ఆంక్షలు విధించింది.

ప్రపంచంలోని అత్యుత్తమ ఆల్‌రౌండర్లలో ఒకడైన షకీబ్ జట్టుకు దూరమై దాదాపు ఏడాది కావొస్తుంది. నిరుడు డిసెంబర్‌లో భారత్‌పై టెస్టు మ్యాచ్ ఆడిన షకీబ్.. మళ్లీ బంగ్లా జెర్సీ వేసుకోలేదు. అయితే.. టీ20 లీగ్స్‌లో మాత్రం మెరుస్తున్నాడీ ఆల్‌రౌండర్. ఈమధ్యే పాకిస్థాన్ సూపర్ లీగ్ లో లాహోర్ కాలెందర్స్‌కు ప్రాతినిధ్యం వహించాడు.

# టీమిండియాలో సర్ఫరాజ్‌కు అవకాశమేంటి ?

ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌కు ఎంపిక చేసిన 18 మంది సభ్యుల భారత జట్టులో యువ ఆటగాడు సర్ఫరాజ్ ఖాన్‌కు చోటు దక్కకపోయిన సంగతి తెలిసిందే. అతడి స్థానంలో కరుణ్ నాయర్‌కు సెలక్టర్లు ఛాన్స్ ఇచ్చారు. అయితే ప్రధాన జట్టు నుంచి సర్ఫరాజ్‌ను తప్పించిన బీసీసీఐ సెలక్షన్ కమిటీ.. ఈ ముంబై ఆటగాడిని ఇండియాఎ జట్టులో భాగం చేసింది.

ఈ క్రమంలో ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగిన రెండు అనాధికారిక టెస్టు సిరీస్‌లో సర్ఫరాజ్ మెరుగైన ప్రదర్శన కనబరిచాడు. అంతేకాకుండా టీమిండియాతో జరిగిన ఇంట్రాస్క్వాడ్ మ్యాచ్‌లో కూడా సెంచరీతో చెలరేగి తన సత్తాచాటుకున్నాడు. ఈ నేపథ్యంలో సెలక్టర్లపై భారత మాజీ క్రికెటర్ ఆకాష్ చోప్రా ప్రశ్నల వర్షం కురిపించాడు. సర్ఫరాజ్ ఏమి తప్పుచేశాడని జట్టు నుంచి తప్పించారని చోప్రా మండిపడ్డాడు.

"సర్ఫరాజ్ ఖాన్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. ఇప్పటివరకు అతడు ఎటువంటి తప్పిదం చేయలేదు. తనకు వచ్చిన అవకాశాలను సద్వినియోగ పరుచుకున్నాడు. బహుశా అతడి బ్యాటింగ్ స్టైల్, టెక్నిక్‌పై నమ్మకం లేకపోవడంతో మీరు ఎంపిక చేసుండకపోవచ్చు. అటువంటి అప్పుడు ఇండియాఎ టీమ్‌కు ఎలా ఎంపిక చేశారు.

ఇంగ్లండ్‌లో అతడు పరుగులు సాధించగలడనే ఉద్దేశ్యంతో ఏ టీమ్‌కు ఎంపిక చేసింటే, అటువంటి అప్పుడు అతడికి ప్రధాన జట్టులో కూడా అవకాశమివ్వాలి. బెంగళూరులో న్యూజిలాండ్‌తో జరిగిన టెస్టులో సర్ఫరాజ్ అద్భుతమైన సెంచరీ సాధించాడు. ఆ తర్వాత రెండు మ్యాచ్‌ల్లో విఫలమయ్యాడు. కానీ ఆ రెండు మ్యాచ్‌లో మిగితా ఆటగాళ్లు కూడా పరుగులు సాధించలేదు. ఆస్ట్రేలియా టూర్‌కు వెళ్లినప్పుడు కనీసం ఒక్క మ్యాచ్‌లో కూడా అతడికి ఆడే అవకాశం రాలేదు" అని తన యూట్యూబ్ ఛానల్‌లో చోప్రా పేర్కొన్నాడు.





## ఈ ఏడాదిలో జాన్వీ పెళ్లి.. లేకుంటే అప్పటివరకూ ఆగాల్సిందే..?

అతిలోక సుందరి శ్రీదేవి కుమార్తెగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన జాన్వీ కాపూర్ ఆ తర్వాత తనకంటే గుర్తింపును సంపాదించుకుంది. బాలీవుడ్ మంచి సక్సెస్ సాధించిన జాన్వీ తెలుగులో 'దేవర' సినిమాతో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. ప్రస్తుతం ఆమె వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉంది. అయితే ఓ జ్యోతిష్యుడు జాన్వీ వివాహం గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు.. ఆమెకు ఈ ఏడాది వివాహం జరుగుతుందని పేర్కొన్నారు.

సిద్ధార్థ్ కన్నన్ అనే యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన జ్యోతిష్యుడు సుశీల్ కుమార్.. 2026 కల్లా జాన్వీ (%జీaఅష్ట్రజఅ ఖaజూశీశీతీ%) కెరీర్ పరంగా మంచి పొజిషన్‌కు వెళ్తుందని తెలిపారు. ఇకపోతే.. ఈ ఏడాది జాన్వీ వివాహం జరుగుతుందని.. లేని పక్షంలో ఆమెకు 33 సంవత్సరాలు వచ్చే వరకూ ఎదురుచూడాల్సిందే అని కామెంట్ చేశారు. ఓ వైపు ఆమె వైవాహిక జీవితం బాగుంటుదని చెబుతూనే.. గ్రహాల వల్ల కొన్ని ఇబ్బందులు కూడా ఉంటాయని తెలిపారు. ప్రస్తుతం సుశీల్ కుమార్ చేసిన వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# 'మహానటి'తో సుహాస్ చిత్రం.. ఎక్కడ చూడొచ్చంటే..



రొటీన్ సినిమాలు కాకుండా.. వైవిధ్యమైన సినిమాలు ఎంపిక చేసుకుంటూ.. కెరీర్‌లో ముందుకెళ్తుంది నటి కీర్తి సురేష్ . ఆమె నటిస్తున్న తాజా చిత్రం 'ఉప్పు కప్పురంబు'. ఈ సినిమాలో సుహాస్ హీరోగా నటిస్తున్నాడు. ఐవి శశి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాని ఎల్లనార్ ఫిలిమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై రాధిక లావు నిర్మించారు. సినిమా బండి ఫేమ్ వసంత్ మురళీకృష్ణ కథను అందించారు. ఒక గ్రామం అసాధారణమైన సంక్షోభాన్ని ఎదుర్కోవడం.. అక్కడి ప్రజలు దానిని ఎలా పరిష్కరించుకుంటారు.. కీర్తికి ఆ గ్రామానికి ఉన్న సంబంధం ఏంటి అనే కథనంతో ఈ సినిమా తెరకెక్కినట్టు తెలుస్తోంది. అమెజాన్ ప్రైమ్ ఒరిజినల్ మూవీగా ఇది సిద్ధమైంది. తాజాగా ఈ సినిమా స్ట్రీమింగ్ తేదీని చిత్ర యూనిట్ వెల్లడిరచింది. జూలై 4వ తేదీన ఈ సినిమా అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఇందుకు సంబంధించి ఓ పోస్టర్‌ని విడుదల చేశారు. తెలుగుతో పాటు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ఈ సినిమా అందుబాటులోకి రానుంది.

# ఇది కేవలం శేఖర్ కమ్ముల సినిమా..


నవతెలంగాణహైదరాబాద్ : ధనుష్ తో పని చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు నాగర్జున. ధనుష్ తో కలిసి నాగర్జున నటించిన చిత్రం 'కుబేర' ప్రీ రిలీజ్ ఈవేంట్ హైదరాబాద్ లో జరిగింది. ఈ కార్యక్రమంలో నాగర్జున మాట్లాడుతూ.. దనుష్ నటన అద్భుతం. ఆయన సెట్స్ లోకి వచ్చాక ఎలాంటి గెటప్ వేయడానికైనా వెనకాడరు. ఈజీగా గెటప్ లోకి మారిపోతారు. ఆయనతో పనిచేయడం అస్సలు మర్చిపోలేను. కుబేర గురించి మాట్లాడాలంటే శేఖర్ కమ్ముల గారే నాకు గుర్తుకు వస్తారు. ఇది నా సినిమా కాదు.. ధనుష్ మూవీ కాదు. రష్మిక మూవీ కాదు. ఇది కేవలం శేఖర్ కమ్ముల గారి సినిమా మాత్రమే. ఆయన కంఫర్ట్ జోన్ నుంచి బయటకు వచ్చి చేసిన మూవీ ఇది. నన్ను కూడా కంఫర్ట్ జోన్ నుంచి బయటకు తెచ్చాడు. మాయా బజార్ సినిమాలో కేవీ రెడ్డి గారే హీరో. ఈ కుబేరలో కూడా శేఖర్ హీరో. మేం రొటీన్ సినిమాల నుంచి బయటపడి కుబేర చేశాం. ఇది నాకు అద్భుతమైన అనుభవం ఇచ్చింది. డీఎస్పీ దీనికి మరో బలం. పాటలు విన్నాక పూనకం వచ్చింది. నేను గీతాంజలి నుంచి ఇలాగే ఉన్నాను. తోట తరణి గారు అలాగే ఉన్నారు. మూవీని చూసి ఎంజాయ్ చేయండి. రష్మికతో పనిచేయడం సంతోషంగా ఉంది అంటూ చెప్పుకొచ్చాడు. హైదరాబాద్ లో తాగి నడిపితే పట్టుకుంటారు. కాబట్టి జాగ్రత్తగా వెళ్లి మీ నాన్నకు దండం పెట్టుకోండి' అంటూ చెప్పాడు.



# రెబల్ వైబ్ స్టార్ట్.. 'రాజాసాబ్' టీజర్ వచ్చేసింది

రెబల్ స్టార్ ప్రభాస్ తొలిసారి నటిస్తున్న రొమాంటిక్ హర్రర్ కామెడీ సినిమా 'రాజాసాబ్'. డైరెక్టర్ మారుతి తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో మాళవికా మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్‌లుగా నటిస్తున్నారు. కొద్దిసేపటిక్రితమే ఈ మూవీ టీజర్ ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మారుతి తోపాటు మేకర్స్ ప్రసాద్ ఐమాక్స్ వద్ద సందడి చేశారు. థియేటర్ వద్ద ప్రభాస్ భారీ కటౌట్ ఏర్పాటు చేశారు. ఈ టీజర్ చూసేందుకు భారీగా అభిమానులు ఐమాక్స్ వద్దకు చేరుకున్నారు. ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి. విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ గా విడుదల కానుంది. తొలిసారి ప్రభాస్.. హారర్ కామెడీ చేస్తుండటంతో ఫ్యాన్స్ తోపాటు సనీ ప్రేక్షకులు 'రాజాసాబ్'పై ఆసక్తిగా ఉన్నారు. ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి.

## రామ్, ఉపేంద్రపై కీలక సన్నివేశాలు



ఎనర్జిటిక్ స్టార్ రామ్ పోతినేని యూనిక్ ఎంటర్‌టైనర్ 'ఆంధ్రా కింగ్ తాలూకా'. మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర ఈ మూవీలో పవర్ ఫుల్ రోల్ చేస్తున్నారు. ఈ చిత్రంలో ఆయన సూపర్ స్టార్ సూర్యకుమార్ అనే పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లోని అల్యుమినియం ఫాక్టరీలో జరుగుతోంది. ఈ షెడ్యూల్‌లో రామ్, ఉపేంద్ర పాల్గొంటున్నారు. కీలక టాకీ పార్ట్ షూట్ చేస్తున్నారు. రామ్, ఉపేంద్ర కాంబినేషన్‌లో వచ్చే ఈ సీన్స్ సినిమాలో మేజర్ హైలెట్‌గా ఉండబోతున్నాయి. ఈ చిత్రంలో రామ్ సరసన భాగ్యశ్రీ బోర్స్ కథానాయికగా నటిస్తోంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in